

వచ్చే నెల 21న ప్రధాని రాక



విశాఖపట్నం, మే 2 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని వచ్చే నెల 21వ తేదీన నగరంలో నిర్వహించనున్న కార్యక్రమానికి భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ హాజరుకానున్నారు. ఈ మేరకు ప్రధానమంత్రి కార్యాలయం నుంచి జిల్లా అధికారులకు సమాచారం అందింది. నగరంలో ఏటా తూర్పు నౌకాదళం, ఆంధ్ర విశ్వవిద్యాలయం, జిల్లా యంత్రాంగం వేర్వేరుగా యోగా దినోత్సవాలు నిర్వహిస్తుంటాయి. అయితే ప్రధాని ఏ కార్యక్రమంలో పాల్గొననున్నారో స్పష్టత రావలసి ఉంది.

సింహగిరిపై

ప్రసాద్ పనుల్లో తీవ్ర జాప్యం

2022 డిసెంబరులో రూ.54 కోట్లు మంజూరుచేసిన కేంద్రం

- రెండేళ్లలో పూర్తికావాల్సిన పనులు ఇంకా కొనసాగుతున్న వైనం
- ఆ నిధులతోనే ఆ గోడ నిర్మాణం
- నిర్మాణంపై తలో మాట... బాధ్యత వహించని అధికారులు
- రాష్ట్ర స్థాయి అధికారుల విచారణకు కమిటీ సన్నాహాలు
- ప్రమాద ఘటన తరువాత మరో టెండర్ పిలిచిన ఏపీటీడీసీ



అసంపూర్తిగా పర్యాటక సమాచార భవనం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

సింహగిరిపై కేంద్ర ప్రభుత్వ పథకం 'ప్రసాద్' (పిలిగ్రిమేజ్ రీజువినేషన్ అండ్ స్పిరిట్యువల్ ఆగ్‌మెంటేషన్ డ్రైవ్)' పనులు పూర్తిచేయడంలో ఏపీటీడీసీ అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారు.

ఈ పథకం కింద 2022 డిసెంబరులో రూ.54 కోట్లు మంజూరయ్యాయి. వీటిని 24 నెలల్లో అంటే 2024 డిసెంబరుకు పూర్తిచేయాల్సి ఉంది. కానీ వైసీపీ హయాంలో కనీసం ఐదు శాతం కూడా చేయలేదు. కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత కలెక్టర్ వాటిని సమీక్షించి వేగవంతం చేయించారు. ఈ పనుల విషయంలో ఏపీటీడీసీ, దేవస్థానం ఇంజనీరింగ్ అధికారుల మధ్య సమన్వయం లోపించింది. ఇప్పటివరకూ నిర్దేశించిన పనుల్లో సగం కూడా పూర్తికాలేదు. ఇంకో ఆరు నెలల్లోగా అవి పూర్తయ్యే సూచనలు కనిపించడం లేదు. ఈ పనుల కోసం మాస్టర్ ప్లాన్ ఒకటి రూపొందించి దానికి ప్రభుత్వం నుంచి ఆమోదం తీసుకున్నారు. మధ్యలో మాస్టర్ ప్లాన్‌ను మార్చేశారు. పలు మార్పులు, చేర్పులు చేసి దేవదాయ శాఖ కమిషనర్‌కు పంపించారు. దానికి అక్కడి నుంచి ఆమోదం రాలేదు. ఈలోగా చందనోత్సవం వచ్చింది. దీనికి అవసరమైన పనులు కూడా ఆ నిధుల నుంచే చేయాలని దేవస్థానం అధికారులు కోరారు. ఏపీటీడీసీ అధికారులు అయిష్టంగానే అంగీకరించారు. జోడుభద్రాల వద్ద రిటైనింగ్ వాల్ నిర్మాణానికి ఎటువంటి అనుమతులు లేవు. అధికారుల మౌఖిక ఆదేశాలు, ఒత్తిడి మేరకు కాంట్రాక్టర్ లక్ష్మణరావు గోడ నిర్మాణం చేపట్టారు. దానికి అధికారులు డిజైన్ ఇవ్వలేదు. కానీ పనులు జరుగుతున్నప్పుడు రెండు శాఖల ఇంజనీరింగ్ అధికారులు వెళ్లి పరిశీలించారు. సిమెంట్ స్తంభాలు వేయకుండా గోడ కడుతున్నా అభ్యంతరం వ్యక్తంచేయలేదు. అలా నిర్మిస్తే గోడ పడిపోతుందని తెలిసినా మిన్నకున్నారు. దీనిపై త్రిసభ్య కమిటీ విచారణ చేసినప్పుడు ఈ గోడ నిర్మాణ బాధ్యత ఎవరు తీసుకుంటారని ప్రశ్నిస్తే ఒక్కరు కూడా ముందుకురాలేదు. కమిటీ అదే విషయం నివేదికలో ప్రస్తావిస్తామని ప్రకటించింది.



నిర్మాణంలో వున్న మల్టీ పర్పస్ భవనం

జరుగుతున్న పనులు రాష్ట్ర స్థాయి అధికారులకు తెలుసా?

సింహాచలంలో జరుగుతున్న పనులు విజయవాడలో ఉన్న ఏపీటీడీసీ ఉన్నతాధికారులు, దేవదాయ శాఖ అధికారులకు తెలుసా? లేదా? అనే అంశాలపై కూడా విచారణ చేస్తామని త్రిసభ్య కమిటీ పేర్కొనడం గమనార్హం. అంటే విశాఖ, విజయవాడ అధికారుల మధ్య కూడా సమన్వయలోపం ఉన్నట్టుగా అర్థమవుతోంది.


ఆదరాబాదరాగా శుక్రవారం టెండర్

ప్రసాద్ పథకం కింద సింహగిరిపై చేపట్టాల్సిన పనులు ఇంకా అనేకం ఉన్నాయి. ప్రమాదం జరగడం, ఈ పథకం పనులపై చర్చ జరగడంతో ఏపీటీడీసీ ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. మిగిలిన పనులు చేపట్టడానికి శుక్రవారం టెండర్ ప్రకటన విడుదల చేశారు.

వచ్చే నెల 9, 10 తేదీల్లో

ఈ-గవర్నెన్స్ జాతీయ సదస్సు

- ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో సహా పలువురు ప్రముఖులు రాక
- హోటళ్లలో 600 గదులు బుకింగ్



విశాఖపట్నం, మే 2 (ఆంధ్రజ్యోతి): నగరంలో వచ్చే నెల 9, 10 తేదీల్లో ఈ-గవర్నెన్స్‌పై జాతీయ సదస్సు జరగనున్నది. ఇప్పటివరకూ ఉన్న సమాచారం ప్రకారం సదస్సును నోవాటెల్‌లో నిర్వహించనున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కేంద్ర ప్రభుత్వానికి చెందిన సంబంధిత మంత్రులు, ఉన్నతాధికారులు, పలు రాష్ట్రాల ప్రతినిధులు హాజరవుతారు. 'వికసిత్ భారత్-సివిల్ సర్వీసెస్ అన్ డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్' పేరిట ఈ సదస్సును కేంద్ర ప్రభుత్వంలోని డిపార్టుమెంట్ ఆఫ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్ అండ్ పబ్లిక్ గ్రీవెన్స్, కేంద్ర కమ్యూనికేషన్లు, ఐటీ మంత్రిత్వ శాఖ, ఏపీ ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. తక్కువ సిబ్బందితో అధిక ఫలితాలు సాధించేలా పాలనకు సంబంధించి మేధావులు, పారిశ్రామికవేత్తలు, విద్యావంతుల నుంచి సలహాలు తీసుకుని పాలసీ రూపొందించడమే సదస్సు ముఖ్య ఉద్దేశం. కాగా సదస్సుకు కేంద్రం, పలు రాష్ట్రాల నుంచి ప్రతినిధులు, ఉన్నతాధికారులు రానున్న నేపథ్యంలో నగరంలోని హోటళ్లలో 600 గదులను ముందుగానే రిజర్వు చేశారు. వాహనాలు ప్రధానంగా ఏసీ బస్సులు, కార్లు కోసం ట్రావెల్స్ సంస్థలతో మాట్లాడుతున్నారు. సదస్సు ఏర్పాట్లపై జిల్లా యంత్రాంగం ఇప్పటికే పలుమార్లు సమావేశాలు నిర్వహించింది. కలెక్టర్ అధ్యక్షతన పలు కమిటీలు ఏర్పాటుచేశారు. విశాఖ వేదికగా 2017లో చంద్రబాబునాయుడు సీఎంగా ఉన్నప్పుడు ఈ గవర్నెన్స్ జాతీయ సదస్సు జరిగింది.

డిగ్రీ ప్రవేశాల్లో మాయ!



- ఇంటర్ ఫేక్ సర్టిఫికెట్లతో అడ్మిషన్లు
- ఏయూ పరిధిలోని కొన్ని కళాశాలల కాసుల కక్కుర్తి
- ఇతర ప్రాంతాల నుంచి సర్టిఫికెట్లు రప్పించి అమ్మకం
- కట్టడిపై దృష్టిసారించని వర్సిటీ ఉన్నతాధికారులు

విశాఖపట్నం, మే 2 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలోని కొన్ని ప్రైవేటు కళాశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ అంతా మాయగా పరిణమిస్తోంది. ఇతర రాష్ట్రాల్లో గుర్తింపులేని విద్యా సంస్థల నుంచి ఇంటర్ సమాన సర్టిఫికెట్లను రప్పించి, విద్యార్థులకు విక్రయించి జేబులు నింపుకుంటున్నాయి. వాటి ఆధారంతో ఆన్‌లైన్ ప్రక్రియలో డిగ్రీ ప్రవేశాలు కల్పిస్తున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై ఇప్పటికే ఇంటర్ బోర్డు పలు దఫాలు హెచ్చరించినా కట్టడికి ఏయూ ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని సమాచారం.

ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు పదో తరగతి వరకు ఆయా ప్రాంతాల్లో విద్యనభ్యసించి, ఇంటర్ చదవకుండానే దొంగ సర్టిఫికెట్లు పొందుతున్నారు. ఆ తరువాత ఏయూ పరిధిలోని కొన్ని కాలేజీల్లో డిగ్రీ కోర్సుల్లో చేరిపో తున్నారు. కాగా ఇటువంటి ప్రవేశాల సందర్భంగా అభ్యర్థుల సర్టిఫికెట్ల జెన్యూనిటీని అధికారులు నిర్ధారించాలి. అయితే ఏయూ పరిధిలో ఈ ప్రక్రియ పకడ్బందీగా జరగడం లేదని సమాచారం. దీంతో ఏటా అర్హత లేని విద్యా సంస్థల నుంచి సంపాదించిన ఇంటర్ సర్టిఫికెట్లతో డిగ్రీ సీట్లు నిండిపోతున్నాయి. పైగా పెద్దమొత్తంలో ఫీజులు చెల్లించేందుకు ముందుకురావడంతో కొన్ని కళాశాలల యాజమాన్యాలు వారికి అడ్డగోలుగా ప్రవేశాలు కల్పిస్తున్నట్టు తెలుస్తోంది. ఇలా చేరినవారు కాలేజీలకు హాజరుకారని, ఫీజులు చెల్లించి పరీక్షలు మాత్రమే రాస్తుంటారని, పట్టా పొందడమే వారి లక్ష్యమని చెబుతున్నారు. మేనేజ్‌మెంట్ కోర్సులు నిర్వహిస్తున్న కాలేజీల్లో ఈ తరహా వ్యవహారాలు ఎక్కువగా జరుగుతున్నాయని సమాచారం.

బోర్డు హెచ్చరికలు బేఖాతర్

ఇటువంటి అడ్డగోలు ప్రవేశాలపై గతంలోనే ఫిర్యాదులు రావడంతో ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు డిగ్రీ కాలేజీలను అప్రమత్తం చేశారు. యూనివర్సిటీలు, వాటికి అనుబంధంగా ఉన్న డిగ్రీ కాలేజీలు తప్పనిసరిగా ఇంటర్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి, అన్నీ నిర్ధారించుకున్న తరువాత మాత్రమే ప్రవేశాలు కల్పించాలని స్పష్టం చేసింది. అయినప్పటికీ ఈ తరహా ప్రవేశాలు యథేచ్ఛగా సాగుతున్నట్టు చెబుతున్నారు.

సర్టిఫికెట్‌కు భారీగా వసూలు..

నగర పరిధిలోని కొన్ని కాలేజీలు ఇతర రాష్ట్రాల విద్యా సంస్థల నుంచి ఇంటర్ సర్టిఫికెట్లను తెప్పించి విద్యార్థులకు అందిస్తున్నాయి. ఇందుకోసం పెద్దమొత్తంలో వసూలు చేస్తున్నట్టు చెబుతున్నారు. సర్టిఫికెట్లు కొనుగోలు చేసే విద్యార్థులకు ఈ కాలేజీలే డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలను కూడా కల్పిస్తున్నాయి. డిగ్రీ ప్రవేశాల ప్రక్రియ ఆన్‌లైన్‌లో జరుగుతుండడంతో ఉన్నత విద్యామండలి వీటిని పూర్తిస్థాయిలో పరిశీలించడం లేదు. ఇంటర్ బోర్డు ఇచ్చే సర్టిఫికెట్లతో సమానమైన సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులు మాత్రమే రాష్ట్రంలో డిగ్రీ కోర్సులు పూర్తిచేసేందుకు అర్హులు. కానీ

... మిగతా 6వ పేజీలో

నోటి మాటతోనే ఆ గోడ నిర్మాణం



- ఎటువంటి డిజైన్, అనుమతులు లేవు
- నేడు ప్రభుత్వానికి నివేదిక
- సింహగిరి దుర్ఘటనపై విచారణ చేపట్టిన కమిటీ చైర్మన్ సురేష్‌కుమార్

సింహగిరిపై రక్షణ గోడ నిర్మాణానికి ఎటువంటి అనుమతులు లేవని విచారణ కమిటీ చైర్మన్ సురేష్‌కుమార్ చెప్పారు. - మెయిన్‌లో

హౌసింగ్‌లో రిటైర్డు ఏఈ దందా

అధికార పార్టీ నేతకు పీఏగా చేరి జిల్లా అధికారులతో సమీక్షలు

- ఇళ్ల నిర్మాణ పనుల నుంచి పాత కాంట్రాక్టర్లు అవుట్
- కొత్తవారికి అప్పగింత
- ఇంటికి రూ.మూడు వేల నుంచి రూ.నాలుగు వేలు ఇవ్వాలని డిమాండ్ చేసినట్టు ప్రచారం

విశాఖపట్నం, మే 2 (ఆంధ్రజ్యోతి):

జిల్లా గృహ నిర్మాణ సంస్థలో ఏఈగా పనిచేసి రిటైరైన అధికారి ఒకరు ఇపుడు మళ్లీ చక్రం తిప్పుతున్నారు. అధికార పార్టీకి చెందిన నాయకుడికి పీఏగా చేరి, కాంట్రాక్టర్లను బెదిరించడం మొదలుపెట్టారంటున్నారు. కాలనీల్లో చేపట్టిన ఇళ్లకు సంబంధించి రూ.మూడు వేల నుంచి రూ.నాలుగు వేలు ఇవ్వాల్సిందేనంటూ ఒత్తిడి తీసుకుతీసుకు వస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది.



పైడివాడ అగ్రహారంలో నిర్మిస్తున్న ఇళ్లు


పేదల కోసం నగర శివారు ప్రాంతాల్లో రూపొందించిన లేఅవుట్‌లలో ఇళ్లు నిర్మిస్తున్న కొందరు కాంట్రాక్టర్లను ఆయన పక్కనపెట్టి కొత్తవారికి పనులు అప్పగించడం వివాదాస్పదమవుతోంది. అందుకు జిల్లా కార్యాలయంలో అధికారులతో సమీక్షలు నిర్వహించడం, కలెక్టర్ నుంచి నేరుగా అనుమతులు తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది. నగర శివారుల్లోని 65 లేఅవుట్‌లలో లక్షకుపైగా ఇళ్లు నిర్మించతలపెట్టారు. ఇంటికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి రూ.1.8 లక్షలు కేటాయించాయి. అయితే ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులు ముందుకురాకపోవడంతో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అనధికారికంగా కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారు. కొందరు కాంట్రాక్టర్లు వేగంగా పనులు చేపట్టగా, మరికొందరు నిదానంగా చేస్తున్నారు. ప్రభుత్వం మారిన తరువాత కూడా వారే కొనసాగుతున్నారు. అందులో కొందరు అధికార పార్టీ నాయకులు, ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకోగా, మరికొందరు తమ పనులు తాము చేసుకుంటూ పోతున్నారు. ఈ నేపథ్యంలో ఐదారు నెలల నుంచి కాంట్రాక్టర్లను హౌసింగ్ అధికారులు కొందరు ఇబ్బందులు పాల్జేస్తున్నా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు. ఇదే సమయంలో గృహ నిర్మాణ సంస్థలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న అధికార పార్టీ నాయకుని వద్ద హౌసింగ్ ఏఈగా పనిచేసి రిటైరైన వ్యక్తి పీఏగా చేరారు. సంస్థలో లోటుపాట్లు తెలిసిన ఆయన నగర శివారుల్లో ఇళ్ల నిర్మాణాలపై దృష్టిసారించారు. ఏడెనిమిది మంది కాంట్రాక్టర్లను టార్గెట్ చేశారు. ముదపాక, గంగవరం, రామవరం, పైడివాడ అగ్రహారం, సంతపాలెం, మామిడిపాలెం, తదితర చోట్ల పనులు చేస్తున్న కాంట్రాక్టర్ల నుంచి సుమారు 11 వేల ఇళ్లను తప్పించి, తనకు నచ్చిన ఏడు నిర్మాణ కంపెనీలకు కేటాయించేలా పావులు కదిపారు. పనులు చేస్తున్న కాంట్రాక్టర్లకు కనీస సమాచారం ఇవ్వకుండా జిల్లా అధికారుల ద్వారా కలెక్టర్ అనుమతి పొందేలా ఫైలు నడిపారు. దీని ప్రకారం

... మిగతా 6వ పేజీలో

వివాహిత హత్య

దాకమర్రి సమీప లే అవుట్‌లో మృతదేహం

- పెట్రోలు పోసి దహనం చేసేందుకు యత్నించిన హంతకులు
- పాక్షికంగా కాలిపోవడంతో లభించని ఆనవాళ్లు
- కేసు నమోదు చేసిన పోలీసులు
- ఆధారాలు సేకరించిన క్లూస్ టీమ్
- విశాఖపట్నం లేదా విజయనగరం ప్రాంత వాసి అయి ఉంటారని అంచనా





సంఘటనా స్థలంలో లభించిన కళ్లజోడు, చెప్పు

భీమునిపట్నం (రూరల్) మే 2 (ఆంధ్రజ్యోతి): వివాహితను దారుణంగా హత్య చేసి, నిర్జన ప్రదేశానికి తరలించి, పెట్రోలు పోసి దహనం చేసేందుకు యత్నించిన సంఘటన శుక్రవారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు...భీమిలి మండలం దాకమర్రి సమీప ఫార్చ్యూన్ హిల్స్ లే అవుట్ వద్ద గుర్తుతెలియని మహిళ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో నార్త్ ఏసీపీ ఎస్.అప్పలరాజు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. సగం కాలిన మృతదేహాన్ని పరిశీలించి, వయసు సుమారు 25 సంవత్సరాలుంటుందని, ఎక్కడో హత్య చేసి మృతదేహాన్ని ఇక్కడికి తీసుకువచ్చి పెట్రోలు పోసి దహనం చేసేందుకు యత్నించి ఉంటారని భావిస్తున్నారు. క్లూస్ టీమ్ ఆధారాలను సేకరించింది. మృతదేహాన్ని నిశితంగా పరిశీలించి వివాహితగా గుర్తించారు. విశాఖపట్నం లేదా విజయనగరం ప్రాంతాలకు చెందిన మహిళ అయి ఉంటుందని, అర్ధరాత్రి సమయంలో ఏదైనా వాహనంలో ఇక్కడికి తీసుకువచ్చి దహనం చేసేందుకు యత్నించి ఉంటారని ప్రాథమికంగా అంచనా వేశారు. సగానికి పైగా

... మిగతా 6వ పేజీలో

పదోన్నతులకు డిజిటల్ అసిస్టెంట్లు విముఖం

- ఉమ్మడి జిల్లాలో 100కుపైగా గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులు పోస్టులు ఖాళీ
- సచివాలయాల్లో పనిచేస్తున్న వారితో భర్తీ చేద్దామంటే ససేమిరా అంటున్న వైనం
- పంచాయతీరాజ్ కమిషనరేట్‌కు నివేదిక

విశాఖపట్నం, మే 2 (ఆంధ్రజ్యోతి):

ఉమ్మడి జిల్లాలో గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతులు తీసుకునేందుకు సచివాలయాల్లో పనిచేసే పలువురు డిజిటల్ అసిస్టెంట్లు విముఖత చూపుతున్నారు. వైసీపీ హయాం(2019-20)లో ఏర్పాటైన సచివాలయాల వ్యవస్థలో పంచాయతీ

... మిగతా 6వ పేజీలో

20న ఉక్కు కార్మికుల సమ్మె

యాజమాన్యానికి నోటీస్ అందజేసిన కార్మిక సంఘ నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, మే 2 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటును ప్రైవేటీకరించరాదని, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20వ తేదీన సమ్మె చేయనున్నట్టు అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు డి.ఆదినారాయణ, కెఎస్ఎన్.రావు, జె.అయోధ్యరాం, పీవీ.రమణమూర్తి, రామస్వామి, కె.దాలినాయుడు, జి.గణపతిరెడ్డి, తదితరులు శుక్రవారం కర్మాగారం డైరెక్టర్ (పర్సనల్) ఎస్‌సీ పాండేకు నోటీస్ అందజేశారు. స్టీల్ ప్లాంటును సెయిల్‌లో విలీనం, సొంత గనుల కేటాయింపు, కాంట్రాక్టు కార్మికులను తొలగించరాదనే డిమాండ్‌ల సాధన కోసం సమ్మె చేస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం పరిపాలనా భవనం ముందు సమ్మెకు మద్దతుగా సంఘీభావం తెలిపారు.

బెల్‌లో కూడా...

అక్కిరెడ్డిపాలెం, మే 2 (ఆంధ్రజ్యోతి): అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 20న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెలో 'బెల్ హెచ్‌పీవీపీ' కార్మికులు పాల్గొంటున్నట్టు ప్రోగ్రెసివ్ ఫ్రంట్ నాయకులు ప్రకటించారు. శుక్రవారం సంస్థ ఈడీ జి.సుబ్రహ్మణ్యానికి సమ్మె నోటీస్‌ను అందచేశారు. ఈ కార్యక్రమంలో జీటీపీ ప్రకాశ్, వారాడ ఆనందరావు, సనపల జగన్నాథరావు, సీతంనాయుడు, పి.ఆనంద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రధానితో...



అమరావతి పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడానికి శుక్రవారం మధ్యాహ్నం గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న ప్రధాని నరేంద్ర మోదీకి స్వాగతం పలుకుతున్న శాసనసభ స్పీకర్ సీహెచ్.అయ్యన్నపాత్రుడు, హోంమంత్రి వంగలపూడి అనిత

మండలాలకు నోట్ పుస్తకాలు

- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా పంపిణీ
- జిల్లాలో మొత్తం 72,627 మంది విద్యార్థులు
- త్వరలో స్టూడెంట్ కిట్స్ రాక



జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం వచ్చిన నోట్ బుక్స్

విశాఖపట్నం, మే 2 (ఆంధ్రజ్యోతి):

వచ్చే విద్యా సంవత్సరానికిగాను ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు పంపిణీ చేసేందుకు నోట్ బుక్స్ మండల స్టాకు పాయింట్లకు చేరాయి. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో ఒకటి నుంచి పదో తరగతి వరకూ బాలురు 33,930, బాలికలు 38,697...మొత్తం 72,627 మంది విద్యార్థులు చదువుకున్నారు. అత్యధికంగా చినగదిలి మండలంలో 12,475 మంది, అతి తక్కువగా ములగాడలో 3,148 మంది ఉన్నారు. గోపాలపట్నం మండలంలో 8,618, మహారాణిపేటలో 8,365, భీమునిపట్నంలో 8,014, సీతమ్మధారలో 7,521, పెందుర్తిలో 7,102, గాజువాకలో 6,224, ఆనందపురంలో 4,239, పెదగంట్యాడలో 3,664, పద్మనాభం మండలంలో 3,257 మంది ఉన్నారు. విద్యార్థులకు నోట్‌బుక్స్‌తో కూడిన స్టూడెంట్ కిట్లు పంపిణీ చేస్తారు. కిట్‌లో స్కూల్ బ్యాగ్, మూడు జతల యూనిఫాం, షూ, రెండు జతల సాక్సులు, బెల్ట్, నోట్‌బుక్స్, పాఠ్య పుస్తకాలు, ఆరో తరగతి వారికి

... మిగతా 6వ పేజీలో


తగరపువలస, భీమిలి మధ్యలో ఉన్న చెరువు


చెరువు అభివృద్ధి కోసం వేసిన శిలాఫలకం


అసంపూర్తిగా ఉన్న రోడ్డు నిర్మాణం

చిల్లపేట చెరువు అభివృద్ధి జరిగేనా ?

- ఎనిమిదేళ్ల క్రితం టీడీపీ హయాంలో ప్రతిపాదనలు
- రూ. 1.98 కోట్లు మంజూరు చేసిన నాటి మంత్రి గంటా
- వైసీపీ పాలనలో పూర్తిగా నిర్లక్ష్యం

తగరపువలస, మే 2 (ఆంధ్రజ్యోతి) : భీమిలి, తగరపువలస రహదారి మధ్యలో ఉన్న చిల్లపేట చెరువు ఆధునికీకరణ కలగానే మిగిలిపోయింది. ఎనిమిదేళ్ల క్రితం అప్పటి టీడీపీ ప్రభుత్వం హయాంలో హైదరాబాద్ ట్యాంక్‌బండ్ తరహాలో ఈ చెరువును అభివృద్ధి చేయాలని వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీ, పర్యాటకశాఖ సంయుక్తంగా నిర్ణయించాయి. ఈమేరకు ప్రతిపాదనలు తయారు చేశారు.అప్పటి మంత్రి గంటా శ్రీనివాసరావు 1.12.2018న ఈ పనులకు శంకుస్థాపన చేశారు. తొలి విడతగా రూ 1.98 కోట్లు విడుదల చేశారు. నిధుల్లో రూ. 90 లక్షలు వెచ్చించి చెరువు తూర్పు భాగంలో గట్టును ఎత్తు చేసి, దానిపై రహదారి నిర్మాణం ప్రారంభించారు. పనులు నిలిచిపోవడంతో ఈ రహదారి ప్రస్తుతం తుప్పలు, మొక్కలతో అధ్వానంగా తయారైంది. చెరువులో కూడా మొక్కలు పెరిగిపోయాయి. 18 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఈ చెరువును లోతు చేయించి, బోట్ షికారు ఏర్పాటు చేయడం, చెరువు చుట్టూ గట్టు నిర్మించి రహదారి నిర్మించడం,పార్కులు నిర్మించడం, చెరువు గట్టు మీద నీటి పథకాన్ని ఏర్పాటు చేయడం వంటి పనులు చేపట్టాలని మాస్టర్ ప్లాన్‌ను రూపొందించారు. పర్యాటక శాఖ, వీఎంఆర్‌డీఏ అధికారులు పలుమార్లు పర్యటించి చేపట్టవలసిన పనులకు అంచనాలు రూపొందించారు. చిట్టివలస, తగరపువలస నుంచి ఈ చెరువులోకి వచ్చే మురుగు నీటి కాలువలను నిలుపుదల చేసి వేరే ప్రాంతాలకు మళ్లించారు. మంజూరైన నిధుల్లో రూ. 90 లక్షలు మాత్రం విడుదలయ్యాయి. ఈ నిధులను వ్యయం చేసే సమయానికి టీడీపీ అధికారం కోల్పోవడంతో ఈ ప్రతిపాదన అటకెక్కిపోయింది. ఇన్ని లక్షలు వ్యయం చేసినా..సగం పనులు కూడా జరగలేదు. కేవలం తూర్పు భాగంలో 300 మీటర్ల మేర రోడ్డు మాత్రమే నిర్మించి విడిచిపెట్టారు. ఈ ప్రాజెక్టు అమల్లోకి వస్తే తగరపువలస ప్రాంతీయులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్లు ఈ చెరువును పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చెరువు ఆధునికీకరణ పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కొమ్మాది, మే 2 (ఆంధ్రజ్యోతి) : బక్కన్నపాలెంలోని ఐటీఐలో ప్రవేశానికి రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ పురుష దివ్యాంగ యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రాజెక్టు ఆఫీసర్ జె. మాధవి తెలిపారు. శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను కార్పెంటర్ (24) , షీట్‌మెటల్ వర్కర్ (20), వెల్డర్ (20) ట్రేడులలో ప్రవేశాలకు ఈనెల 24వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశం పొందిన వారికి ఉచిత భోజనం, వసతి సదుపాయం కల్పిస్తామని, శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. వివరాలకు 9000013610 నంబర్‌ను సంప్రతించాలని ఆమె సూచించారు.

అప్పన్నను దర్శించుకున్న విదేశీయులు

సింహాచలం, మే 2 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామిని రష్యాకు చెందిన పర్యాటకులు శుక్రవారం దర్శించుకుంటున్నారు. వారు అతిశ్రీఘ్రదర్శనం రూ. 300 టికెట్లు తీసుకుని అంతరాలయంలో స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం అప్పన్న ఆలయాన్ని, సింహగిరి అందాలను తమ కెమెరాల్లో బంధించి మురిసిపోయారు.



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే గంటా

మత్స్యకారులకు అండగా ప్రభుత్వం

ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

భీమునిపట్నం, మే 2 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకారుల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఆయన బీచ్ రోడ్డులోని క్యాంప్ కార్యాలయంలో 2025 మంది మత్స్యకారులకు రూ. 4.5 కోట్ల వేట నిషేధ భృతి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం మండలంలో 1700 మందికి రూ. 1.70 కోట్ల భృతి అందించగా, తాము వేట నిషేధ భృతిని రూ. 10 వేలు నుంచి రూ. 20 వేలుకు పెంచడంతో పాటు 2025 మందికి సహాయం అందించామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి ఎమ్మెల్యే గంటా, మత్స్యకారులు పాలాభిషేకం చేశారు. గంటాను మత్స్యకార సహకార కో ఆపరేటివ్ సొసైటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. అలాగే ఎమ్మెల్యేకు వల, కిరీటం, బుంగ అలంకరించారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు గంటా నూకరాజు, గరికిన కింగ్, కారి అప్పారావు, గాడు వెంకటప్పడు, గొలగాని నరేంద్రకుమార్, పాసి నరసింగరావు, అనిల్‌ప్రసాద్, మొల్లి లక్ష్మణరావు, నొడగల అప్పారావు, బీజేపీ నాయకులు కె. సునీత, జనసేన నేత శ్రీనివాసరావు, మత్స్యశాఖ జేడీ లక్ష్మణరావు, జోనల్ కమిషనరు అయ్యప్పనాయుడు, తహసీల్దార్ రామారావు, ఎంపీడీవో హనుమంతరావు, భీమిలి మత్స్యశాఖాధికారి లావణ్య తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

తగరపువలస, మే 2 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని కంచరపాలెంలో ఈనెల 10, 11వ తేదీల్లో జరగనున్న సీపీఐ 25వ జిల్లా మహాసభల పోస్టర్‌ను ఆ పార్టీ నాయకులు శుక్రవారం స్థానిక జీఆర్ భవన్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కె. రాంబాబు, ఎం. అప్పలరాజు, ఏఐటీయూసీ కార్యదర్శి కె. ఈశ్వరరావు, సీహెచ్ రామ్ పైడి, ఎన్. ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

కె1 కాలనీలో జడ్సీ పర్యటన


కాలనీవాసులతో మాట్లాడుతున్న జడ్సీ కనక మహాలక్ష్మి

కొమ్మాది, మే 2 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పరిధిలో ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ చేపడుతున్నామని జోన్ -2 కమిషనర్ కె. కనక మహాలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఆమె ఆరో వార్డు పరిధిలోని కె1 కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులకు ఇంటింటి చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. పారిశుధ్యం అధ్వానంగా ఉంటే రోగాలు వస్తాయమని, ప్రతిఒక్కరూ చెత్తను పారిశుధ్య కార్మికులకు అందించాలని సూచించారు. కాలనీలో అక్కడక్కడ పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించాలని శానిటేషన్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జోన్-2 ఏఎంహెచ్ఓ డాక్టర్ కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

ఫెర్రో ఎలక్ట్రిక్ మెటీరియల్స్‌పై గీతంలో ఎఫ్‌డీపీ

సాగర్‌నగర్, మే 2 (ఆంధ్రజ్యోతి) : భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగం (డీఎస్‌టీ) సహకారంతో పర్స్ (ప్రమోషన్ ఆఫ్ యూనివర్సిటీ రీసెర్చి అండ్ సైంటిఫిక్ ఎక్సలెన్స్) ప్రాజెక్టులో భాగంగా నూతన సాంకేతిక పరికరాలపై ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లోని పరిశోధకులకు, అధ్యాపకులకు గీతంలో శుక్రవారం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ (ఎఫ్‌డీపీ) కార్యక్రమం నిర్వహించారు. ఎక్సపరిమెంటల్ టెక్నిక్స్ ఫర్ మేగ్నటిక్ అండ్ ఫెర్రో ఎలక్ట్రిక్ మెటీరియల్స్ అన్న అంశంపై నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ నిపుణుడు ప్రొఫెసర్ అభిషేక్ మండల్, యూజీసీ-డీఏఈ నిపుణుడు ప్రొఫెసర్ ముకుల్ గుప్తా, సుధీంద్ర రాయప్రోలు, పి.డి. బాబు,వి.రాఘవేందర్ ముఖ్య అతిధులుగా హాజరయ్యారు.


పునర్నిర్మాణం తరువాత గిరిపై అనంతుని ఆలయ శిఖరం


హోమాలకు నిర్మించిన యాగశాల

అనంతుని ఆలయ శిఖర ప్రతిష్ఠకు శరవేగంగా ఏర్పాట్లు

పద్మనాభం, మే 2 (ఆంధ్రజ్యోతి) : అనంతుని గిరిపై ఈనెల 5 నుంచి 9 వరకు పద్మనాభుని ఆలయ శిఖర ప్రతిష్ఠ, మహా సంప్రోక్షణ నిర్వహించడానికి దేవస్థానం ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే యాగశాల నిర్మాణం, ఇతర పనులు చేపట్టారు.ఈనెల 5న సాయంత్రం కుంభ కళా వాహనతో కార్యక్రమానికి శ్రీకారం చుడతారు. కుంతీమాధవస్వామి సన్నిధి నుంచి కలశలో ఆవాహన చేసిన స్వామివారిని పల్లకీపై ఊరేగింపుగా గిరిపైకి తీసుకువెళతారు. గిరిపై 6న ఉదయం వాస్తు పూజ, హోమం, అకల్మష హోమం, నవగ్రహ ఆరాధన హోమం, సాయంత్రం విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, అజస్ర దీపారాధన, రక్షాబంధన, మృత్సంగ్రహణం, అంకురార్పణ, అగ్నిమథనం, అగ్నిప్రతిష్ఠాపన, ఉక్త హోమం నిర్వహిస్తారు. 7న విష్వక్సేనారాధన, పుణ్యాహం, అగ్నిధ్యానం, వివిధ హోమాలు నిర్వహిస్తారు. 8న ఉదయం అగ్ని ధ్యానములు, జలాధివాసం, అధివాస హోమం, అష్టాక్షరీ మహా మంత్ర హోమం, శయనాధివాసం, మహా శాంతి హోమం నిర్వహిస్తారు. 9న విష్వక్సేనారాధన, పుణ్యాహం, అగ్ని ధ్యానం, ఉక్త హోమం కార్యక్రమాల అనంతరం విమాన శిఖర ప్రతిష్ఠ, కళావాహన, ప్రథమార్చన, గోదర్శనం, శాంతి కల్యాణం, ప్రసాద వితరణ చేపట్టనున్నట్టు ఉత్సవ కమిటీ తెలిపింది.

సీసీ కెమెరాల నిర్వహణపై నిర్లక్ష్యం

సింహాచలం, మే 2 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నిర్వహణపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గత నెల 30న జరిగిన చందనోత్సవం సందర్భంగా దేవస్థానం అధికారులు గతంలో ఉన్న 195 కెమెరాలకు అదనంగా 125 తాత్కాలిక కెమెరాలను పోలీసుల సూచనల మేరకు ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణ సక్రమంగా లేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ కారణంగానే జోడుభద్రాల వద్ద గోడ కూలి భక్తులు మృతి చెందిన సంఘటనకు సంబంధించి అధికారులు కెమెరాలను పరిశీలించలేదని తెలుస్తోంది.

సింహగిరిపై భారీ వర్షం


ఈదురుగాలులకు పడిపోయిన పెండాళ్లు

సింహాచలం,మే 2 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. వర్షంతో పాటు ఈదురుగాలులు వీయడంతో చందనోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన పెండాళ్లు నేలకొరిగాయి. అలాగే పలు చోట్ల సిసి కెమెరాలు కూడా పడిపోయాయి.

కుట్టు మిషన్ శిక్షకులకు సర్టిఫికెట్లు పంపిణీ

భీమునిపట్నం (రూరల్), మే 2 (ఆంధ్రజ్యోతి) : చిప్పాడలోని దివీస్ నైపుణ్య శిక్షణ కేంద్రంలో కుట్టు మిషన్ శిక్షణ పొందిన 41 మంది మహిళలకు సర్టిఫికెట్లు, కుట్టు మిషన్ టూల్ కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఆ కంపెనీ జనరల్ మేనేజరు వైఎస్ కోటేశ్వరరావు, ఎంఎస్‌ఎం రావు చేతుల మీదుగా వీటిని అందించారు ఈ కార్యక్రమంలో సీఎస్‌ఆర్ విభాగానికి చెందిన సురేశ్‌కుమార్, శ్రీనివాస్, శేఖర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

మండలాలకు నోట్ పుస్తకాలు

... 5వ పేజీ తరువాయి

ఆక్స్‌ఫర్డు డిక్షనరీ, ఒకటో తరగతి పిల్లలకు బొమ్మల పుస్తకం ఉంటాయి. గతంలో ఈ కిట్‌ను జగనన్న విద్యా దీవెన పథకంగా ప్రచారం చేసేవారు. గత ఏడాది కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్రగా పేరు మార్చింది. నోట్ పుస్తకాలపై ప్రభుత్వ అధినేతల ఫొటోలు లేకుండా చర్యలు తీసుకున్నారు. ఇప్పటివరకూ జిల్లాకు నోట్ బుక్స్ పూర్తిస్థాయిలో, పాఠ్య పుస్తకాలు 60 శాతం వరకూ రాగా మండలాలకు పంపించారు. మండల పాయింట్లలో నోట్ పుస్తకాలను డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్, సమగ్రశిక్షా అభియాన్ ఏపీసీ చంద్రశేఖరరావు, సీఎంవో దేముడుబాబు పరిశీలించారు.

వృత్తి విద్యా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాక్షినగర్, మే 2 (ఆంధ్రజ్యోతి) : విశాలాక్షినగర్‌లో ఉన్న దయాల్బాగ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ (డీఈఐ) వృత్తి విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఇనిస్టిట్యూట్ ఇన్‌చార్జి దక్షిణామూర్తి తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. డిప్లొమో ఇంజనీరింగ్ ఎలక్ట్రానిక్స్ మూడేళ్ల కోర్సుతో పాటు బీబీఏ ఆన్‌లైన్ మూడేళ్ల కోర్సు, బ్యాచిలర్ ఆఫ్ ఒకేషనల్ కోర్సు (అగ్రికల్చరల్ టెక్నాలజీ)కు దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఆసక్తి గల వారు ఈనెల 28లోగా దయాల్‌నగర్‌లో ఉన్న ఇనిస్టిట్యూట్‌లో దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9963340611 నెంబర్‌లో సంప్రతించాలని ఆయన సూచించారు.

అంతర్జాతీయ వాణిజ్య అంశాలపై చర్చ

సాగర్‌నగర్, మే 2 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ వాణిజ్యంలో భారత్‌తో పాటు అగ్రరాజ్యాల మధ్య ప్రస్తుతం జరుగుతున్న పన్నుల యుద్ధం.. వాటి ప్రభావంపై వాణిజ్య నిపుణులతో గీతం బిజినెస్ స్కూల్‌లో శుక్రవారం చర్చ నిర్వహించారు. పన్నుల పెంపు, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, కార్మిక చట్టాలు, వాణిజ్య అసమానతలు, పర్యావరణం, తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో భారత ప్రభుత్వ సంస్థ ఎక్స్‌పోర్టు క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్ (ఈసీజీసీ) అధికారి పి. అజిత్‌కుమార్, గీతం అంతర్జాతీయ వాణిజ్య విభాగం చైర్‌పర్సన్ డాక్టర్ రాధారఘురామ పాత్రుడు, గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ లుబ్నానిహార్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం

సింహాచలం, మే 2 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి మధురవాడకు చెందిన వేదనభట్ల రామసత్యనారాయణ రూ. లక్ష విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తం రూ.1,00,116లను శుక్రవారం ప్రొటోకాల్ విభాగం పర్యవేక్షణాధికారి సివివి పద్మనాభరాజు (విక్రమ్)కు నగదు రూపంలో అందజేశారు.

ఆర్‌టీసీకి రూ.33 లక్షల ఆదాయం

సింహాచలం : చందనోత్సవం సందర్భంగా నడిపిన సర్వీసుల ద్వారా సింహాచలం ఆర్‌టీసీ డిపోకు రూ.33.44 లక్షల ఆదాయం సమకూరినట్టు డిపో మేనేజర్ శరత్‌బాబు తెలిపారు. శుక్రవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. సింహగిరి నుంచి కొండదిగువకు 69 బస్సులు బస్సులు నడపగా రూ.24,06,610 లక్షల ఆదాయం సమకూరిందన్నారు. అలాగే నగరంలో పలు ప్రాంతాల నుంచి 62 సర్వీసుల ద్వారా రూ. 9, 38,000 లక్షల ఆదాయం లభించిందన్నారు.

కాలువలో పడి వ్యక్తి మృతి

గాజువాక, మే 2 (ఆంధ్రజ్యోతి) : కాలువలో పడిపోయి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన శుక్రవారం గాజువాక అమరావతి పార్కు వద్ద జరిగింది. కర్నవానిపాలేనికి చెందిన పి.వెంకటరమణమూర్తి (60) లారీ డ్రైవర్. గురువారం రాత్రి ఇంటి నుంచి వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదు. శుక్రవారం ఉదయం అమరావతి పార్కు వద్ద కాలువలో పడి ఉండడంతో స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మద్యం మత్తులో పడిపోయి మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

భీమిలిలో అడ్వంచర్ వాటర్ స్పోర్ట్స్

భీమునిపట్నం, మే 2 (ఆంధ్రజ్యోతి) : భీమిలిలో టూరిజం అభివృద్ధికి ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చర్యలు చేపడుతోంది. ఈమేరకు బీచ్‌లో ఏపీటీడీసీ, ప్రైవేట్ భాగస్వామ్యంతో బోన్వయేజ్ అడ్వెంచర్ వాటర్ స్పోర్ట్సు ప్రాజెక్టు ఏర్పాటు చేస్తున్నారు. బీచ్ ఇసుకలో గాలిమేడ ప్రాంతంలో టికెట్ బుకింగ్ ఆఫీసుకు కంటైనర్‌ను, చిన్నారులను ఆకట్టుకునేలా ఏటివి సీనియర్ వాహనం, ఏటివి జూనియర్ వాహనం, ఆటో బైక్‌లను ఏర్పాటు చేశారు. వీటిని చందనోత్సవం నాడు ప్రారంభించామని, త్వరలో అన్ని ఏర్పాట్లు చేస్తామని నిర్వాహకులు బీఎల్ పవన్ తెలిపారు. ఏడాదిన్నర క్రితం విజయవాడలో ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పలు ప్రాజెక్టులకు బిడ్డింగ్ వేశారని, వాటిలో రుషికొండ ఐటీ బీచ్ వద్ద, భీమిలి ప్రాజెక్టులు తమకు లభించాయని తెలిపారు. ఏపీటీడీసీ, తాము సంయుక్తంగా ఈ ప్రాజెక్టును నిర్వహిస్తామన్నారు.

డిగ్రీ ప్రవేశాల్లో మాయ!

... 5వ పేజీ తరువాయి

ఏయూ పరిధిలో ఈక్వెలెన్సీ గుర్తింపు ప్రక్రియ చేపట్టడం లేదు.

భారీగా ప్రవేశాలు..

ఏయూ పరిధిలో 196 డిగ్రీ కాలేజీలు ఉన్నాయి. వీటిలో 38 కాలేజీల్లో డిగ్రీ, పీజీ రెండూ నిర్వహిస్తున్నారు. ఆయా కాలేజీల్లో ఏటా సుమారు 20 వేల మంది విద్యార్థులు డిగ్రీ ప్రవేశాలు పొందుతుంటారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వారు ఉద్యోగాలు, వ్యాపారాల రీత్యా నగరంలో నివసిస్తున్నారు. వారిలో కొందరు గుర్తింపులేని కాలేజీల నుంచి ఇంటర్ సర్టిఫికెట్లను సంపాదించి, డిగ్రీలో చేరుతున్నారు. అంతేకాదు ఇక్కడి వారిలోనూ కాలేజీకి వెళ్లి చదివేందుకు అవకాశం లేని కొందరు ఇలా సర్టిఫికెట్లు కొనుగోలు చేసి డిగ్రీలో చేరుతున్నారని సమాచారం. దీనిపై ఏయూ అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించడంతో పాటు ఆయా కాలేజీలపై నిఘా పెట్టాలని కోరుతున్నారు.

హౌసింగ్‌లో రిటైర్డు ఏఈ దందా

... 5వ పేజీ తరువాయి

పి.దుర్గామాధవికి 1,295, గ్రోత్ వెంచర్స్‌కు 1,793, సాయి ఎంటర్‌ప్రైజస్‌కు 2,044, మౌంటెన్ గ్రో కనస్ట్రక్షన్స్‌కు 2,597, శ్రావ్య ఇన్‌ఫ్రాకు 850, ఎస్‌వీ కనస్ట్రక్షన్స్‌కు 1,343, ఆద్య కనస్ట్రక్షన్స్‌కు 2,495 ఇళ్లు అప్పగించారు. వారితో హౌసింగ్ కార్యాలయంలో సమావేశం నిర్వహించి ప్రతి ఇంటికీ రూ.మూడు వేలు నుంచి రూ.నాలుగు వేలు ఇవ్వాలని అడిగినట్టు ప్రచారం జరుగుతోంది. ఇదిలావుండగా రిటైర్డు ఏఈ తమకు తెలియకుండా ఉన్నతాధికారుల ద్వారా 11 వేల ఇళ్లు ఇతర సంస్థలకు అప్పగించడంపై పాత కాంట్రాక్టర్లు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటివరకూ తాము చేసిన పనుల మేరకు బిల్లులు ఇవ్వకుండా మరొకరికి ఎలా ఇస్తారని ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం జిల్లా హౌసింగ్ కార్యాలయంలో రిటైర్డు ఏఈ హవా కొనసాగుతుండంతో కాంట్రాక్టర్లు, సిబ్బంది సతమతమవుతున్నారు.

దాకమర్రిలో వివాహిత హత్య

... 5వ పేజీ తరువాయి

కాలిపోవడంతో ఆనవాళ్లు లభించలేదని ఏసీపీ అప్పలరాజు తెలిపారు. ఆనందపురం, పోతినమల్లయ్యపాలెం, పద్మనాభం, భీమిలి పోలీస్ సిబ్బందితో ఆరు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటుచేసి, దర్యాప్తు బాధ్యతను అప్పగించినట్టు ఏసీపీ ఎస్.అప్పలరాజు చెప్పారు. పోస్టుమార్టం అనంతరం వివరాలు తెలిసే అవకాశముందని భీమిలి సీఐ బి.తిరుమలరావు తెలిపారు.

పదోన్నతులకు డిజిటల్ అసిస్టెంట్లు విముఖం

... 5వ పేజీ తరువాయి

కార్యదర్శి-గ్రేడ్-6 హోదాలో డిజిటల్ అసిస్టెంట్ల నియామకం జరిగింది. ఉమ్మడి విశాఖ జిల్లాలో గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులుగా ఏర్పడే ఖాళీలను డిజిటల్ అసిస్టెంట్లతో భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 969 గ్రామ పంచాయతీలలో గ్రేడ్-5 కార్యదర్శులుగా పనిచేసిన వారిలో 50 మందికిపైగా గ్రేడ్-4 కార్యదర్శులుగా ఇప్పటికే పదోన్నతులు ఇచ్చారు. గ్రేడ్-4 కార్యదర్శులుగా పనిచేస్తూ ఉన్నత ఉద్యోగాలు సంపాదించుకున్న వారు తమ ఉద్యోగాలకు రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో 100కుపైగా గ్రేడ్5 కార్యదర్శుల ఖాళీలు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ఖాళీ అయిన గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులుగా సమీపంలోని పంచాయతీలల్లో పనిచేస్తున్న కార్యదర్శులకు ఇన్‌చార్జిబాధ్యతలు అప్పగించారు. అర్హుల జాబితా రూపొందించి గ్రేడ్-5 కార్యదర్శుల పోస్టులు భర్తీ చేయాలని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డిజిటల్ అసిస్టెంట్లలో సీనియారిటీ మేరకు జాబితాను విశాఖ జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం రూపొందించింది. అయితే గ్రేడ్-5 కార్యదర్శులుగా పదోన్నతులు తమ వద్దని పలువురు డిజిటల్ అసిస్టెంట్లు జిల్లా పంచాయతీ అధికారులకు నివేదించారు. పదోన్నతులు కోసం ప్రతి ఉద్యోగి ఎదురుచూస్తుంటారని, అటువంటిది పదోన్నతులు వద్దని చెప్పడంపై అధికారులు ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. డిజిటల్ అసిస్టెంట్లుగా సచివాలయంలో డెస్క్ జాబ్ చేయడం తమకు సులువుగా ఉంటుందని, గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతి తీసుకుంటే పాలన మొత్తం పర్యవేక్షించడంతో పాటు రాజకీయ నాయకుల నుంచి ఒత్తిళ్ల వంటివి భరించాల్సి ఉంటుందని అంటున్నారు. పదోన్నతులు వద్దనే వారి వివరాలు సేకరించే పనిలో పంచాయతీ అధికారులు ఉన్నారు. మొత్తం వివరాలు తీసుకుని పంచాయతీరాజ్ కమిషనరేట్‌కు పంపి, తరువాత పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని యోచిస్తున్నారు.

ఫుట్‌పాత్‌పై దుకాణాలు


ఫుట్‌పాత్‌పై విచ్చలవిడిగా ఏర్పాటు చేసిన దుకాణాలు

తగరపువలస, మే 2 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస సర్వీసు రోడ్డులో ఉన్న ఫుట్ పాత్‌పై కొందరు అక్రమంగా దుకాణాలు ఏర్పాటు చేస్తు న్నారు. ఈ స్థలం ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉందని జీవీఎంసీ అధికారులు, జీవీఎంసీ పరిధిలో ఉందని ఆర్‌అండ్‌బీ అధికారులు చెబుతుండడం వల్ల అక్రమార్కులు విచ్చలవిడిగా దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. కొంతమంది నాయకులు కూడా దుకాణాలు ఏర్పాటు చేసి, అద్దెకు ఇస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. విద్యుత్ శాఖాధికారులు వీటికి కనెక్షన్లు కూడా ఇచ్చారు. ఈ విషయమై ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సింహగిరిపై రామానుజాచార్యులు తిరు నక్షత్ర పూజలు


పారాయణలు చేస్తున్న వైదికులు

సింహాచలం, మే 2 (ఆంధ్రజ్యోతి) : విశిష్టాద్వైత మత వ్యవస్థాపకులు భగవద్రామానుజాచార్యులు తిరు నక్షత్ర పూజలు శుక్రవారం వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. మధ్యాహ్నం పవళింపు సేవ అనంతరం ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో, అలాగే రామానుజాచార్యులు ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన రెండు వేదికలపై అధిష్ఠింపజేశారు.ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్ పర్యవేక్షణలో ఉప ప్రధానార్చకుడు కరి సీతారామాచార్యులు, ఇతర వైదికులు తొలుత షోడశోపచారాలు సమర్పించారు. తరువాత పండితులు వేద పఠనాలు చేయగా, అధ్యాపకులు రామానుజ నూతందాది పారాయణ చేశారు. అనంతరం రామానుజులకు పర్యవేష్టం చుట్టి గౌరవానిచ్చారు. మంత్రపుష్పం, ప్రత్యేక నివేదనలు జరిపి మంగళ నీరాజనాలిచ్చారు.

నేతాజీనగర్‌లో రహదారులు అస్తవ్యస్తం


ఇదీ సచివాలయం రోడ్డు పరిస్థితి

- ఏ వీధిలో చూసినా యూజీడీ తవ్వకాలే..
- నెలల తరబడి సా...గుతున్న పనులు
- మట్టితో పూడ్చడంతో అధ్వానంగా రహదారులు
- వీధుల్లోకి బైక్ సైతం వెళ్ల లేని దుస్థితి
- పట్టించుకోని అధికారులు

మద్దిలపాలెం, మే 2 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డులో రహదారులు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. భూగర్భ డ్రైనేజీ పనుల కోసం తవ్విన రోడ్లపై పూడిక పనులు సరిగా చేపట్టకపోవడంతో అధ్వానంగా తయారయ్యాయి. వర్షాలు పడినప్పుడు పరిస్థితి మరింత దారుణంగా మారుతోందంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు మధ్యలో తవ్వి మట్టితో పూడ్చడంతో బురదమయంగా తయారవుతున్నాయి.

ఈ వార్డులోని పలు ప్రాంతాల్లో సుమారు రెండు నెలల కిందటే అండర్ డ్రైనేజీ పనులు ప్రారంభించారు. సకాలంలో పనులు పూర్తి చేయలేదు. దీంతో స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. పనులు జాప్యం అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

జీవీఎంసీ 22వ వార్డు నేతాజీనగర్‌లోని నాలుగు వీధుల్లో అండర్ డ్రైనేజీ లీక్ అవడంతో రెండు నెలల కిందట మరమ్మతు పనులు చేపట్టారు. కొత్త పైపులైన్లు వేయడానికి రోడ్లు తవ్వారు. పైపులు వేసి గోతులను మట్టితో పూడ్చారు. నేతాజీ నగర్ రెండో లైన్ వీధి రోడ్డు మరింత అధ్వానంగా ఉంది. నడవడానికి కూడా వీల్లేకుండా ఉండడంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. సచివాలయం రోడ్డు మధ్యలో వేసిన పైపులైన్ గోతులు మట్టితో కప్పడంతో బైకులు సైతం వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు ఆయా రోడ్లలు బురదమయమయ్యాయి.గోతులరోడ్డుల్లో రాకపోకలు సాగించలేక పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

23వ వార్డులో..

మద్దిలపాలెంలో పెద్దనుయ్యి, రామాలయం, దళాయి వీధుల్లో నెలల తరబడి అండర్ డ్రైనేజీ పనులు చేస్తున్నారు. వీధులన్నీ రోడ్డు మధ్యలో తవ్వి వదిలేశారు. పది, పదిహేను రోజుల్లో పూర్తి అయిపోవాల్సిన ఈ పనులు నెలలు గడిచినా పూర్తి కావడం లేదు. ఉదయం వివిధ పనులపై వెళ్లే స్థానికులు ఈ రోడ్లపై వెళ్లడానికి నరకయాతన పడుతున్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారుల పట్టించుకోకపోవడం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వెరసి తమ పాలిట శాపంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అండర్ డ్రైనేజీ పనులు పూర్తి చేసిన వెంటనే శాశ్వత రోడ్డు మరమ్మత్తులు చేట్టాల్సిన కాంట్రాక్టర్లు ఏమీ పట్టనట్టు వదిలేశారు. దీనిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టిపెట్టి రహదారుల సమస్యలుపరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.


నేతాజీనగర్‌లో పైపులైన్ వేసి సరిగా పూడ్చకుండా వదిలేసిన రహదారి

సీఎస్‌ను కలిసిన మేయర్ పీలా


చీఫ్ సెక్రటరీ విజయానంద్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన మేయర్ పీలా శ్రీనివాస్, చిత్రంలో గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్

వెంకోజీపాలెం, మే 2 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ మేయర్‌గా ఎన్నికైన పీలా శ్రీనివాసరావు.. రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్‌ను అమరావతి సచివాలయంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మహా విశాఖ నగరాభివృద్ధికి నిధులు కేటాయించి సహకరించాలని చీఫ్ సెక్రటరీని మేయర్ కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్.. మేయర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా విశాఖ నగరాన్ని మరింత ప్రగతిపథంలో నడిపించేందుకు జీవీఎంసీలో సుపరిపాలన సాగిస్తూ విశాఖ నగర ప్రజలకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు, అందించాల్సిన సంక్షేమ కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

మెడికల్ పీజీ విద్యార్థిని మౌనిషాకు డాక్టర్ శారదాబాయి గోల్డ్ మెడల్ ప్రదానం


మౌనిషాకు గోల్డ్ మెడల్‌ను బహూకరిస్తున్న డాక్టర్ సంధ్యాదేవి, డాక్టర్ శివానంద, డాక్టర్ మధుసూదనరావు, డాక్టర్ సరోజినీ

విశాఖపట్నం, మే 2 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రా మెడికల్ కాలేజీ (ఏఎంసీ)లో గైనిక్ విభాగంలో పీజీలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన డాక్టర్ జేపీ మౌనిషాకు డాక్టర్ కె.శారదాబాయి మెమోరియల్ గోల్డ్ మెడల్‌ను ప్రదానం చేశారు. గైనిక్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభతో రాణించిన విద్యార్థులకు గైనిక్ విభాగ ప్రొఫెసర్‌గా పని చేసిన డాక్టర్ శారదాబాయి పేరుతో గోల్డ్ మెడల్ ప్రదానం చేస్తుంటారు. ఈ ఏడాదికి డాక్టర్ మౌనిషాకు ఏఎంసీ పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద, పూర్వసూపరింటెండెంట్ డాక్టర్ మధుసూదన్‌బాబు గోల్డ్ మెడల్‌ను ప్రదానం చేశారు. తన భార్య పేరుతో గోల్డ్ మెడల్‌ను అందించడం ఆనందంగా ఉందని, విద్యార్థులను ప్రోత్సహించే ఉద్దేశంతో గైనిక్ పీజీ విద్యార్థులకు ఈ మెడల్ అందిస్తున్నట్టు డాక్టర్ మధుసూదన్‌బాబు వెల్లడించారు.

ఎమ్మెల్యే వంశీకృష్ణతో మేయర్, డీసీసీబీ చైర్మన్ భేటీ


మేయర్ పీలా శ్రీనివాసరావు, డీసీసీబీ చైర్మన్ కోన తాతారావును అభినందిస్తున్న దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

మద్దిలపాలెం, మే 2 (ఆంధ్రజ్యోతి) : శివాజీపాలెంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావు, కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్ కోన తాతారావు వేర్వేరుగా దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా వంశీకృష్ణ మేయర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అలాగే డీసీసీబీ చైర్మన్ కోన తాతారావును శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి కృషి చేసిన పార్టీ శ్రేణులు, ప్రజలకు అందుబాటులో ఉంటూ సహాయసహకారాలు అందించాలని సూచించారు.

వేంకటేశ్వరాలయంలో శ్రీరామానుజ స్వామి జయంతి


ప్రత్యేక అలంకరణలో శ్రీరామానుజం

ఎంవీపీ కాలనీ, మే 2 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీలోని ఆరో సెక్టరులో ఉన్న వేంకటేశ్వరస్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి విశిష్టాద్వైతమత వ్యవస్థాపకుడు శ్రీభగవద్రామానుజస్వామి వర్ష తిరునక్షత్ర సందర్భంగా ఆలయం ఆవరణలో శుక్రవారం ఉదయం పంచామృతాభిషేకం, శాత్తుముర్రై, అష్టోత్తర శతనామార్చన, తీర్థ గోష్ఠి నిర్వహించారు. ప్రత్యేక పూజలకు భక్తులు భారీగా హాజరయ్యారు.

టీటీడీ కల్యాణమండపంలో పుష్ప సంకల్పం



ఎంవీపీ కాలనీ, మే 2 (ఆంధ్రజ్యోతి) : తిరుపతిలోని కోదండరామ స్వామికి శనివారం నిర్వహించనున్న పుష్పయాగం సందర్భంగా నగరంలోని ఎంవీపీ కాలనీ టీటీడీ కల్యాణమండపంలో శుక్రవారం పుష్ప సంకల్పం నిర్వహించారు. భక్తుల సమక్షంలో కలువ, తామర, మల్లె, గులాబీ పుష్పాలను స్వామివారి వద్ద సంకల్పం చేసి, వాటిని తిరుమల తిరుపతి దేవస్థానానికి పంపించారు. శ్రీవారి భక్తులు హిమాంశు ప్రసాద్ ఆధ్వర్యంలో పుష్ప సంకల్పం నిర్వహించారు.

సినిమా గైడ్

- **హిట్** : జగదాంబ, సంగం, శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **రెట్రో** : మెలోడి, శరత్, శ్రీకన్య, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి)
- **అర్జున్ సన్నాఫ్ వైజయంతి** : సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఓదెల-2** : శ్రీలీలామహల్, సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
- **కోర్ట్** : వెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 19, టమాటా 16, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 28, పచ్చిమిర్చి 24, కాకరకాయలు 34, బీరకాయలు 34, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 28, క్యాబేజి 13, క్యారెట్ 32 దొండకాయలు 26, బంగాళదుంపలు 18, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 38, అల్లం (పాతది)44, బరబాటి 26, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 125, బద్దచిక్కుడు 48, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 66, కీరదోస 30, కాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 34, కంద 80, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 30, కర్ర పెండలం 18, మామిడిఅల్లం 48, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	450
విజయనగరం	454
శ్రీకాకుళం	454

చికెన్ ధరలు (బ్యాగ్)	
రైతు ధర	120
లైవ్ ధర	140
విత్ స్కిన్	250
స్కినలెస్	260

చంద్రన్న పట్టాలకు రిజిస్ట్రేషన్

- తప్పుల సవరణకూ అవకాశం
- ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు



ఎంవీపీ కాలనీ/ ఆరిలోవ, మే 2 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో మంజూరు చేసిన చంద్రన్న పట్టాలకు రిజిస్ట్రేషన్ చేయించుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఒక ప్రకటనలో తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేయించుకోకుండా ప్రజలను ఇబ్బందులకు గురి చేసిందని, తమ ప్రభుత్వం జీవో నెంబరు 30 ద్వారా ఈ అవకాశాన్ని కల్పిస్తోందని పేర్కొన్నారు. జీవో నెంబరు 296, 388 ద్వారా లబ్ధిదారులకు అందించిన చంద్రన్న పట్టాలను తాజా జీవో ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చన్నారు. పట్టాల్లో ఏవైనా తప్పులు దొర్లినా వాటిని సరిచేయించుకోవడానికి సంయుక్త కలెక్టర్, ఆర్డీవో, తహశీల్దార్‌లతో శనివారం ఆరిలోవ తోటగరువు ఎర్నిదుర్గమాంబ కల్యాణ మండపంలో సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

సాయంత్రం నాలుగు గంటల నుంచి అధికారులు ఇక్కడ అందుబాటులో ఉంటారని, లబ్ధిదారులు తమ వినతులు, ఫిర్యాదులతో అక్కడకు వచ్చి అధికారులను సంప్రదించవచ్చని తెలిపారు.

మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి

- 'ఆపరేషన్ కగార్' వెంటనే విరమించాలి
- సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు


ధర్నా నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

సిరిపురం, మే 2 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కర్రెగుట్ట చుట్టివేతను తక్షణమే విరమించాలని, వెంటనే మావోయిస్టు పార్టీతో ప్రభుత్వం శాంతి చర్చలు జరపాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యదర్శి ఎం. వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ సారథ్యంలో ప్రజా సంఘాలతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీలను సమూలంగా నిర్మూలించి అటవీ సంపదను కార్పొరేట్లకు ధారదత్తం చేసే దురుద్దేశంతో కేంద్ర ప్రభుత్వం సాగిస్తున్న కర్రెగుట్ట చుట్టివేతను తక్షణమే ఉపసంహరించాలని కోరుతున్నామన్నారు. చత్తీస్‌ఘడ్, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతంలోని ఉన్న కర్రెగుట్ట చుట్టివేత ప్రాంతాన్ని 'ఆపరేషన్ కగార్' పేరుతో వేలాది మంది సైనిక బలగాలను దింపి మావోయిస్టులు, గిరిజనులను చంపుతున్నారని ఆరోపించారు. తక్షణమే ఈ నరమేధాన్ని ఆపి మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు చరపాలని ఆయన డిమాండ్ చేశారు. సీపీఐ నాయకుడు ఎం.పైడిరాజు మాట్లాడుతూ రాజమండ్రి నుంచి రాయపూర్ వరకు ఎనిమిది లైన్ల రహదారులు అందంగా వేసింది ప్రజల కోసం కాదని కార్పొరేట్ల కోసమేనన్నారు. పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఎం. లక్ష్మి మాట్లాడుతూ కేంద్ర హోంమంత్రి 2023 కల్లా మావోయిస్టులను అంతం చేస్తానని ప్రకటించడం, ఎదురుకాల్పుల పేరిట ఏకపక్ష హత్యలకు పూనుకోవడం రాజ్యాంగం విరుద్ధమన్నారు.

ఈ ధర్నాలో న్యాయవాది సురేష్, డీటీఎఫ్ సాయిప్రసాద్, రాజకీయ ఖైదీల విడుదల కమిటీ వేదిక ప్రతినిధి పద్మ, విద్యా ప్రైవేటీకరణ వేదిక కిషోర్, కె.నిర్మల, కేఎస్ చలం, సురేష్, కె.రవి తదితరులు పాల్గొన్నారు.

ఫెయిలైన ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు


కృష్ణా కళాశాలలో ప్రత్యేక తరగతులకు హాజరైన విద్యార్థులు

మద్దిలపాలెం, మే 2 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో తక్కువ ఉత్తీర్ణత నమోదైన ప్రభుత్వ జూనియర్ కళాశాలపై జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఈ నెల 12 నుంచి ప్రారంభమయ్యే సప్లిమెంటరీ పరీక్షలకు సంసిద్ధులను చేసేందుకు కృషి చేస్తోంది. ఈ మేరకు జిల్లాలోని పది ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

ఈ ఏడాది పది ప్రభుత్వ జూనియర్ కళాశాలల నుంచి ప్రథమ, ద్వితీయ సంవత్సరాల నుంచి 2,799 మంది పరీక్షలు రాయగా 1213 మంది ఉత్తీర్ణతులయ్యారు. 1,586 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. వీరి కోసం ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. ఫెయిలైన సబ్జెక్టులలో ముఖ్య ప్రశ్నలను వివరించి బోధిస్తున్నారు. ఎక్కువమంది విద్యార్థులు గణితం కెమిస్ట్రీ, ఫిజిక్స్, ఎకానమిక్స్ సబ్జెక్టులలో ఫెయిల్ అవగా, ఇంగ్లీషు సబ్జెక్టులో కూడా కొందరు తప్పారు. పరీక్షలు తప్పిన విద్యార్థులు తప్పనిసరిగా తరగతులకు వచ్చే విధంగా అధ్యాపకులు చర్యలు తీసుకుంటున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు సైతం ఫోన్లు చేసి ఈ ప్రత్యేక తరగతులకు పంపించాలని కోరుతున్నారు.

ప్రత్యేక తరగతులు ఈ నెల 10 వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ నెల 12 నుంచి విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలకు హాజరుకానున్నారు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణత మెరుగు పరిచేందుకు ఇంటర్ విద్యాశాఖ ప్రత్యేక కార్యచరణతో ముందుకు వెళ్తోంది. ప్రత్యేక తరగతులు ఏ మేరకు ఫలితాలిస్తాయో వేచి చూడాలి.

జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరానికి 23 వినతులు

వెంకోజీపాలెం, మే 2 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీలో ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 23 వినతులు వచ్చినట్టు జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ ఎ.ప్రభాకరరావు తెలిపారు. శుక్రవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో సీపీలు, డీసీపీలు, ఏసీపీలతో కలిసి ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

జీవీఎంసీ పరిధిలో ప్రజలు పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి ఫిర్యాదులు, వినతులను ప్రతి శుక్రవారం నమోదు చేసుకోవచ్చని సీసీపీ పేర్కొన్నారు. ఓపెన్ ఫోరమ్‌లో వచ్చిన దరఖాస్తులను నిర్ణీత సమయంలో వెంటనే స్పందించి పరిష్కరించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను సీసీపీ ఆదేశించారు.

ఉద్యోగులంతా సమయపాలన పాటించాలి

- వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్


ఉద్యోగులతో మాట్లాడుతున్న ప్రణవ్‌గోపాల్

సిరిపురం, మే 2 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగులందరూ సమయపాలన పాటించాలని, వివిధ పనులపై సంస్థకు వచ్చే ప్రజలు, ఫిర్యాదుదారులకు జవాబుదారీతనంగా ఉండాలని వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ సూచించారు. శుక్రవారం వీఎంఆర్డీఏ భవన్‌లోని అన్ని విభాగాలను ఆయన ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధ్యమైనంత త్వరగా ప్రజా సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. సంస్థకు చెందిన సోషల్ మీడియా విభాగాన్ని మరింత బలోపేతం చేస్తూ వీఎంఆర్డీఏకు చెందిన విషయాలను ఎప్పటికప్పుడు సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని ఆదేశించారు. ఈ తనిఖీలో కార్యదర్శి మురళీకృష్ణ, ఎస్టేట్ అధికారి దయానిధి, చీఫ్ అర్బన్ ప్లానర్ శిల్ప, పర్యవేక్షక ఇంజనీర్ భవానీశంకర్, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో దక్షిణామూర్తి వార్షికోత్సవం


ఆలయం వద్ద భక్తుల సందడి

వెంకోజీపాలెం, మే 2 (ఆంధ్రజ్యోతి) : కొత్త వెంకోజీపాలెం శ్రీ గౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో వేంచేసి ఉన్న దక్షిణామూర్తి ఆలయం 3వ వార్షికోత్సవం శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారు జాము నుంచి భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఆరవెల్లి సూర్యప్రకాష్‌శర్మ, సుబ్రహ్మణ్యశాస్త్రి, బాలభాస్కర శర్మలు భక్తుల గోత్రనామాలతో అభిషేకాలు జరిపారు. కార్యక్రమంలో గ్రామ సేవా సంఘం సభ్యులు ఎస్.నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నాటక ప్రదర్శనలు


'అనుశ్వరం' నాటికలో ఓ రసవత్తర సన్నివేశం

మద్దిలపాలెం, మే 2 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురం కాలనీలోని కళాభారతి ఆడిటోరియంలో విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రదర్శించిన నాటకాలు అలరించాయి. మొదట విజయవాడకు చెందిన శ్రీకృష్ణ తెలుగు థియేటర్ సంస్థ కళాకారులు ప్రదర్శించిన 'అనశ్వరం' నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. వెంకట చంద్రశేఖర్ దర్శకత్వంలో వరప్రసాద్, హసన్ షేక్, శ్రీజసాధినేనిలు అద్భుత నటనతో చూపరులను కట్టిపడేశారు. నవోదయ ఆర్ట్స్ సంస్థ నిర్వహణలో ప్రదర్శించిన రెండో నాటకం 'ఉడతా ఉడతా ఊత్..' సందేశాత్మకంగా సాగింది.ముందుగా అకాడమీ అధ్యక్షుడు మంతెన సత్యనారాయణరాజు, కార్యదర్శి రాంబాబు జ్యోతిప్రజ్వలన చేసి ప్రదర్శనలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అకాడమీ సభ్యులు, కళాభిమానులు పాల్గొన్నారు.

ఉచితంగా ఈసీజీ, ట్రోప్ ఐ వైద్య పరీక్షలు

- అపోలో ఆస్పత్రి కార్డియాలజీ వైద్య నిపుణులు డాక్టర్ వినీషా

రామ్‌నగర్, మే 2 (ఆంధ్రజ్యోతి) : నేటి జీవన పరిస్థితుల్లో ఆరోగ్య సమస్యల పట్ల ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించి ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని అపోలో ఆస్పత్రి కార్డియాలజీ వైద్య నిపుణులు డాక్టర్ వినీషా తెలిపారు. శుక్రవారం రామ్‌నగర్ అపోలో కార్డియాలజీ విభాగంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరికైనా గుండెలో మంటగా ఉంటే.. అది గుండెకు సంబంధించిన సమస్యా? లేదా గ్యాస్ట్రిక్ సమస్యనా? అనే ఆలోచన వస్తుందని,ఇకపై అలాంటి ఆలోచన లేకుండా నేరుగా అపోలో ఆస్పత్రిలో ఉచితంగా ఈసీజీ, కొలెస్ట్రాల్ రక్తపరీక్ష వైద్య పరీక్షలు నిర్వహించి సమస్యను నిర్ధారిస్తామన్నారు.

వైద్య నిపుణుల సలహా..

ఒక వేళ గుండెకు సంబంధించిన సమస్య అయితే ఉచితంగా కార్డియాలజీ వైద్య నిపుణులతో వైద్య సలహాలు అందించ నున్నట్టు తెలిపారు. ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా గుండెకు సంబంధించిన సమస్య లపై అవగాహన కల్పిస్తూ డీవైస్ క్లినిక్ ఏర్పాటు చేశామని, పేస్ మేకర్ తదితర వాటిని అందుబాటులో ఉంచినట్టు తెలిపారు, అంతేకాకుండా అతి తక్కువ ఖర్చుతో హెల్త్ చెకప్ నిర్వహించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ టి రవికాంత్, అడ్మినిస్ట్రేటర్ సందీప్ పాల్గొన్నారు.

ఎండీయూకు పౌరసరఫరాల శాఖ అధికారుల వార్నింగ్

అక్కయ్యపాలెం, మే 2 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిధిలో తాటిచెట్లపాలెం-కైలాసపురం పరిసరాల్లో బియ్యంకార్డులకు సరుకులు పంపిణీచేసే ఎండీయూ ఆపరేటర్‌పై వచ్చిన ఫిర్యాదుపై పౌరసరఫరాల అధికారులు శుక్రవారం విచారణ జరిపారు. మూడు డిపోల పరిధిలో సరుకుల పంపిణీతోపాటు బంధువులు మరో రెండు డిపోలను అనధికారికంగా ఎండీయూ ఆపరేటరే నిర్వహిస్తున్నట్టు అధికారులు గుర్తించారు. బియ్యం కార్డుదారులకు సక్రమంగా సరుకులు పంపిణీ చేయాలని ఆదేశించారు. మరోసారి ఫిర్యాదు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిష్పాక్షిక విచారణకు సీపీఎం వినతి

డాబాగార్డెన్స్, మే 2 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం ఘోర ప్రమాద ఘటనపై రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిష్పక్షపాతంగా విచారణ జరపాలని ప్రభుత్వం నియమించిన కమిటీకి సీపీఎం నాయకులు వినతి పత్రం అందజేశారు. శుక్రవారం కమిటీ సభ్యులను సీపీఎం జిల్లా బృందం కలిసి వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సింహాచలం చందనోత్సవంలో రక్షణగోడ కూలిన దుర్ఘటనలో ఏడుగురు భక్తులు అక్కడికక్కడే మృతిచెందడం రాష్ట్ర ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. భవిష్యత్‌లో ఇలాంటివి చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, భక్తుల ప్రాణాలకు రక్షణ కల్పించేలా సిఫార్సు చేయాలని విజ్ఞప్తి చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సభ్యులు డా.బి.గంగారావు, ఆర్కేఎస్వీ కుమార్, పి.మణి, బి.జగన్, జ్యోతీశ్వరరావు తదితరులు విచారణ కమిటీని కలిశారు.

హోటల్స్, రెస్టారెంట్స్ క్రికెట్ టోర్నీ

విశాఖపట్నం స్పోర్ట్సు, మే 2 (ఆంధ్రజ్యోతి): హోటల్స్, రెస్టారెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నిర్వహిస్తున్న అంతర్ హోటల్స్, రెస్టారెంట్స్ క్రికెట్ టోర్నీ శుక్రవారం ప్రారంభమైంది. నగరంలోని ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో జరుగుతున్న ఈ టోర్నీ తొలిరోజు జరిగిన మ్యాచ్‌లలో ద పార్కు హోటల్ తొమ్మిది వికెట్ తేడాతో మేఘాలయ హోటల్‌పై, రాక్‌డేల్ 13 పరుగుల తేడాతో ఐటీ ఫార్చ్యూన్ ఇన్‌పై, పామ్‌బీచ్ హోటల్ 141 పరుగుల తేడాతో రాయల్ ఫోర్టుపై గెలుపొందాయి.

కనీస వేతనం అమలుకు మెడికల్ రిప్రజెంటేటివ్స్ డిమాండ్

డాబాగార్డెన్స్, మే 2 (ఆంధ్రజ్యోతి): మెడికల్ రిప్రజెంటేటివ్స్‌కు కనీస వేతనం అమలు చేయాలని యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కృష్ణయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ఏపీ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ జిల్లా మహాసభలో ఆయన మాట్లాడుతూ తమకు సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయీస్ చట్టం అమలు చేయాలన్నారు. కొత్తగా తెస్తున్న లేబర్ కోడ్స్ కారణంగా దీనికి విఘాతం జరిగే ప్రమాదం ఉందన్నారు. మెడికల్ రిప్రిజనల్ అందరినీ హెల్తీ స్కిల్ కేటగిరీగా గుర్తించాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి చంద్రమౌళి, సభ్యులు సంజయ్‌కుమార్, కిరణ్‌కుమార్, మెడికల్ రిప్రజెంటేటివ్స్, ఎఫ్ఎంసీజీ రిప్రజెంటేటివ్స్ పాల్గొన్నారు. తదుపరి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

జనావాసాల మధ్య మద్యం దుకాణం వద్దు

» బర్మాక్యాంప్ రోడ్డులో దుకాణం మూయించిన మహిళలు


మద్యం దుకాణం ముందు ధర్నా చేస్తున్న కామాక్షినగర్‌వాసులు

మురళీనగర్, మే 2 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 49వ వార్డు బర్మాక్యాంప్ కామాక్షినగర్ రోడ్డులో కొత్తగా లైసెన్సు పొందిన మద్యం దుకాణం ఎదుట శుక్రవారం స్థానిక మహిళలు నిరసన తెలిపారు. జనావాసాల మధ్య మద్యం దుకాణం వద్దంటూ దుకాణం ఎదుట గుమిగూడి నినాదాలు చేశారు. కామాక్షినగర్, మాణిక్యాంబ కాలనీ, రైల్వే సొసైటీ కాలనీల ప్రాంతాలు సహా బర్మాక్యాంప్, ఎల్‌బీనగర్ ప్రాంతాల నివాసితులు పెద్ద సంఖ్యలో దుకాణం ఎదుట నిరసన స్వరం వినిపించారు. సమస్యాత్మక ప్రాంతంగా ఉన్న బర్మాక్యాంప్‌ని మరింత జటిలంగా మార్చవద్దని ఎక్సైజ్, పోలీసు అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులను వేడుకున్నారు. ఆసుపత్రి ఎదుట మద్యం దుకాణం ఏర్పాటుకు ఎలా అనుమతులు ఇస్తారని అధికారులను మహిళలు ప్రశ్నించారు. నిత్యం రద్దీగా ఉండే బర్మాక్యాంప్ దారిలో ఇప్పటికే శ్మశాన వాటిక వద్ద అంతిమ సంస్కారాల కారణంగా రాకపోకలకు ఇబ్బంది పడుతుంటే, మద్యం దుకాణానికి అనుమతి ఇవ్వడంతో మరింత గందరగోళం ఏర్పడుతుందని పేర్కొంటూ తమ నిరసన తెలిపారు.

ఈ ప్రాంతం వివాదాలకు నిలయం



మద్యం దుకాణ నిర్వాహకులు ఇప్పటికే పలు వివాదాల్లో ఉన్నారు. స్థానికంగా నిషేధిత స్థలాల్ని ఆక్రమించి తన ఇళ్లు, షాపులు కట్టి అద్దెలకు ఇస్తూ రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్నారు. ఎవరూ ఏమీ చేయలేరని మాట్లాడుతున్నారు. ఈ వ్యవహారంపై అధికారులు దృష్టి సారించాలి.

-కె.పద్మ, కామాక్షినగర్

లైసెన్సు రద్దు చేయండి



బర్మాక్యాంప్ నివాసితులంటే ప్రైవేటు సంస్థలు రుణాలు కూడా ఇవ్వడం లేదు. తగాదాలకు పేరు మోసిన ప్రాంతంగా ముద్ర పడిపోయింది. ఇలాంటి చోట ఇపుడు మద్యం దుకాణం తెరిస్తే, మరిన్ని గొడవలకు దారితీసినట్టు అవుతుంది. ప్రధానంగా ఆసుపత్రి ఎదుట వైన్ షాప్ కేటాయించడం సరైన నిర్ణయం కాదు. ప్రజాప్రతినిధులు, ఎక్సైజ్ శాఖ అధికారులు షాప్ లైసెన్స్‌ను రద్దు చేయాలి.

-వి.మహేష్, బర్మాక్యాంప్

'ప్రభుత్వ హామీలన్నీ నెరవేర్చాలి'


ప్లకార్డులు, సిలిండర్ నమూనాలతో మహిళల నిరసన

డాబాగార్డెన్స్, మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని ఐద్వా నాయకులు అన్నారు. శుక్రవారం డాబాగార్డెన్స్ కృష్ణాగార్డెన్స్‌లోని మహిళలు ఐద్వా ఆధ్వర్యంలో గ్యాస్ సిలిండర్ నమూనాలు పట్టుకుని ఉచిత గ్యాస్ సిలిండర్ డబ్బులు విడుదల చేయాలంటూ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఐద్వా, సీఐటీయూ నాయకులు, స్థానిక మహిళలు మాట్లాడుతూ ఉచిత గ్యాస్ సిలిండర్ డబ్బులు తమకు అందలేదని ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని నిధులు విడుదల చేయాలని కోరారు. గ్యాస్ సబ్సిడీ నూటికి 30 మందికి మాత్రమే అందించి, మిగిలిన వారికి ఇవ్వలేదన్నారు. గ్యాస్ సిలిండర్ ధరలు పెంచడం దుర్మార్గమన్నారు. ఉచిత బస్సు సౌకర్యం కూడా అమలు చేయడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కర్రీ గణేష్, ఎం.సుబ్బారావు, లెనిన్, అమ్మాజీ, అరుణ, లక్ష్మీ, సరోజినీ, వెంకటలక్ష్మి, పార్వతి, కాంతం, రామయమ్మ పాల్గొన్నారు.

వేతనాలు అందక ఆందోళన


కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న తల్లిబిడ్డ వాహనాల సిబ్బంది

మహారాణిపేట, మే 2 (ఆంధ్రజ్యోతి) ఆంధ్రప్రదేశ్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని సంఘం గౌరవ అధ్యక్షురాలు పి.మణి డిమాండ్ చేశారు. శుక్రవారం సంఘం ప్రతినిధులు కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వలేదని, వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రూ.18 వేల వేతనంలో యాజమాన్యాలు కేవలం రూ.8,800 చెల్లిస్తున్నాయని తెలిపారు. చట్ట ప్రకారం పీఎఫ్, ఈఎస్ఐ, వారాంతపు సెలవు, జాతీయ పండుగల సెలవులు అమలు చేయాలని కోరారు. విధుల నిర్వహణకు వీలుగా రీచార్జి సౌకర్యంతో మొబైల్ ఫోన్లు సమకూర్చాలని కోరారు. వాహనాలకు మరమ్మతు చేయించి, వాటి సంఖ్యకు అనుగుణంగా అదనపు సిబ్బందిని నియమించాలన్నారు. జిల్లా సంఘ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణపై దృష్టి సారించాలి


కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అక్కయ్యపాలెం, మే 2 (ఆంధ్రజ్యోతి): కిశోర బాలికల ఆరోగ్య సంరక్షణపై తల్లిదండ్రులు దృషి సారించాలని 42వ వార్డు కార్పొరేటర్ ఆళ్ల లీలావతి సూచించారు. రైల్వేన్యూకాలనీ జగన్నాథపురంలోని అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం కిశోర బాలికల ఆరోగ్య సంరక్షణపై అవగాహన సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన కార్పొరేటర్ లీలావతి మాట్లాడుతూ బాలికల హక్కులు, బాల్య వివాహాల కట్టుడి, ఆరోగ్య, పరిశుభ్రత కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం అధికారులు కిశోర బాలికలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వార్డు బీజేపీ అధ్యక్షుడు కె.గురుగోవింద్ సింగ్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఆశాదేవి, ఆర్పీ అలివేణి, వార్డు సంరక్షణ కార్యదర్శులు పద్మావతి, ఎలిజబిత్, అంగన్వాడీ టీచర్ వరలక్ష్మి, ఏఎన్ఎం ఎస్.లత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి కార్పొరేటర్ ఆర్థిక సహాయం


ఆర్థికసహాయం చేస్తున్న కందుల నాగరాజు

అల్లిపురం, మే 2 (ఆంధ్రజ్యోతి): ఏడుగుళ్ల ప్రాంతంలో మృతి చెందిన అప్పయ్యమ్మ అంత్యక్రియల నిమిత్తం విశాఖ దక్షిణ నియోజకవర్గ జనసేన నాయకుడు, 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు శుక్రవారం ఆర్థిక సహాయం చేశారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సహకారంతో వార్డులో సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుడతామన్నారు.

స్నేహ మాక్స్ సంస్థపై కేసు నమోదు

సీతంపేట, మే 2 (ఆంధ్రజ్యోతి): అధిక వడ్డీ ఇస్తామని విశ్రాంత ఉద్యోగులను నమ్మించి కట్టించుకున్న డిపాజిట్ల మొత్తాన్ని వాపసు చేయని స్నేహ మాక్స్ సంస్థ నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు ద్వారకా పోలీసులు తెలిపారు. సీతంపేట రాజేంద్రనగర్‌లో స్నేహ మాక్స్ సంస్థను 2008లో కటికల శివ భాగ్యరావు వ్యవస్థాపక ఏర్పాటు చేశారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు, పలు సంస్థల విశ్రాంత ఉద్యోగులను నమ్మించి బ్యాంకులు కన్నా అధికంగా వడ్డీ చెల్లిస్తానని ఆశ చూపి డిపాజిట్లు కల్లించుకున్నాడు. అనేక మంది రూ.3 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు ఆ సంస్థలో డిపాజిట్ చేశారు. న్యూకరసాకి చెందిన పి.ప్రకాశరావు రూ.37.7 లక్షలు డిపాజిట్ కట్టారు. తనకు వడ్డీ చెల్లించలేదని, డిపాజిట్‌లు తీసుకొని సంస్థ నిర్వాహకులు మకాం మార్చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తనతో పాటు మరో 16 మంది రూ.6.32 కోట్లు చెల్లించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. తమను మోసగించిన ఆ సంస్థ చైర్మన్ శివ భాగ్యరావు, స్వర్ణలత, శ్రీకాంత్, కృతి కుమార్, పున్నారావు, డైరెక్టర్లపై చర్యలు తీసుకుని తమ డబ్బు వాపసు ఇప్పించాలని బాధితులు ఫిర్యాదులో కోరినట్లు పోలీసులు తెలిపారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

అక్కయ్యపాలెం, మే 2 (ఆంధ్రజ్యోతి): రైల్వే ఎగ్జిబిషన్ మైదానం ఎదురుగా ఉన్న షిర్డీ సాయిబాబా ధ్యానమందిరంలో శుక్రవారం వీ హెల్త్ కేర్, వీ డెంటల్ కేర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 200 మందికి అధిక రక్తపోటు, చక్కెర వ్యాధి తదితర ఆరోగ్య పరీక్షలు, దంత వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు, వీ హెల్త్ కేర్ డాక్టర్ స్వర్ణలత, సిబ్బంది కృష్ణ, తులసి, లతీష్ తదితరులు పాల్గొన్నారు.

కాలువలో పడి వ్యక్తి మృతి


వెంకటరమణమూర్తి (ఫైల్)

గాజువాక, మే 2 (ఆంధ్రజ్యోతి): కాలువలో పడిపోయి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన శుక్రవారం గాజువాక అమరావతి పార్కు వద్ద జరిగింది. కర్నవానిపాలేనికి చెందిన పి.వెంకటరమణమూర్తి (60) లారీ డ్రైవర్. గురువారం రాత్రి ఇంటి నుంచి వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదు. శుక్రవారం ఉదయం అమరావతి పార్కు వద్ద కాలువలో పడి ఉండడంతో స్థానికులు గమనించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. మద్యం మత్తులో పడిపోయి మృతిచెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డీజిల్ లోకోషెడ్ 60 ఏళ్ల వార్షికోత్సవం


డీజిల్ లోకోషెడ్‌ను సందర్శిస్తున్న డీఆర్ఎం లలిత్ బొహ్రా, సీనియర్ డీఎంఈ రుద్ర రంజన్ తదితరులు

విశాఖపట్నం, మే 2 (ఆంధ్రజ్యోతి): విశాఖలోని డీజిల్ లోకోషెడ్‌ని స్థాపించి 60 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం ప్రత్యేక వేడుకలు జరిగాయి. వాల్తేరు డివిజన్ సౌత్ ఈస్ట్రన్ రైల్వే పరిధిలో ఉన్న సమయంలో 1965 మే 2న విశాఖలో డీజిల్ లోకోషెడ్‌ను ఏర్పాటు చేశారు. నాటి నుంచి అంచెలంచెలుగా విస్తరించి ప్రస్తుతం 450 లోకోమోటివ్‌ల ఫ్లీట్ బలంతో దేశంలోని అతిపెద్ద డీజిల్ లోకోషెడ్‌గా మారింది. 2003లో జోన్‌ల విస్తరణలో భాగంగా సౌత్ ఈస్ట్రన్ రైల్వేను మూడుగా విభజించిన తర్వాత కూడా తూర్పు తీర రైల్వేల అవసరాలను తీర్చే ఏకైక డీజిల్ లోకోషెడ్ ఇదే కావడం విశేషం. ఈ సందర్భంగా శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో డీఆర్ఎం లలిత్ బొహ్రా మాట్లాడుతూ ప్రధాన ఎక్స్‌ప్రెస్ రైళ్లు, సరుకు రవాణా రైళ్లకు లోకో మోటివ్‌లను అందించడం ద్వారా దేశంలో కీలక సేవలందించే షెడ్‌గా విశాఖలోని డీజిల్ లోకోషెడ్ నిలవడం తూర్పుకోస్తా రైల్వే వాల్తేరు డివిజన్‌కు గర్వకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డివిజనల్ మెకానికల్ ఇంజనీర్ రుద్ర రంజన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వంశీకృష్ణతో మేయర్, డీసీసీబీ చైర్మన్ భేటీ


మేయర్ పీలా శ్రీనివాసరావు, డీసీసీబీ చైర్మన్ కోన తాతారావును అభినందిస్తున్న దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

మద్దిలపాలెం, మే 2 (ఆంధ్రజ్యోతి): శివాజీపాలెంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావు, కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్ కోన తాతారావు వేర్వేరుగా దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ మేయర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అలాగే డీసీసీబీ చైర్మన్ కోన తాతారావును శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి కృషి చేసిన పార్టీ శ్రేణులు, ప్రజలకు అందుబాటులో ఉంటూ సహాయసహకారాలు అందించాలని సూచించారు.

ఘనంగా ఆదిశంకరాచార్యుల జయంతి


పూజాదికాలు నిర్వహిస్తున్న అర్చకులు

మహారాణిపేట, మే 2 (ఆంధ్రజ్యోతి): శ్రీ కనకమహాలక్ష్మి ఆలయంలో జగత్‌గురువు ఆదిశంకరాచార్యుల జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయంలో వేద పండితులు, అర్చకులు ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కనకమహాలక్ష్మి అమ్మవారికి సైతం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పోషకాహారంతో చర్మ సంరక్షణ

మహారాణిపేట, మే 2 (ఆంధ్రజ్యోతి): వాతావరణ కాలుష్యం శరీరంపైనే కాకుండా చర్మ ఆరోగ్యంపైనా తీవ్ర ప్రభావం చూపుతుందని చర్మవ్యాధుల నిపుణురాలు డాక్టర్ ఎం.గీతికా అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశమందిరం వద్ద చర్మ ఆరోగ్యానికి తీసుకోవలసిన పోషకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యువత చర్మ సౌందర్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నా, అందుకు అవసరమైన పోషకాహారం తీసుకోవటంలేదని తెలిపారు. చర్మ సమస్యలలో ఆహారం కీలక పాత్ర పోషిస్తుందని, రోజూ మనం ఇంటిలో తీసుకునే ఆహారంలో పోషకాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. చర్మ సంరక్షణకు పెరుగు వినియోగం మేలు చేస్తుందని, విటమిన్లు ఎ, కొవ్వు, ఆమ్లాలు, ఆహారం చర్మాన్ని కాపాడతాయన్నారు. విటమిన్ 'సి'తో కూడిన పండ్లు పర్యావరణ, కాలుష్య కారకాల నుంచి చర్మ ఆరోగ్యానికి రక్షణ కల్పిస్తాయని, ముఖవర్చస్సు కూడా పెరుగుతుందని పేర్కొన్నారు.

వేసవి శిబిరం ప్రారంభం


శిబిరానికి హాజరైన బాలబాలికలు

డాబాగార్డెన్స్, మే 2 (ఆంధ్రజ్యోతి): గీతా భవనంలో గీతా ప్రచార సమితి ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరం శుక్రవారం ప్రారంభించారు.విశ్రాంత ఎస్‌బీఐ ఉన్నతాధికారి ఎ.శ్రీధర్ జ్యోతిని వెలిగించి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన బాలబాలికలను ఉద్దేశించి మాట్లాడుతూ మేధాశక్తిని పెంపొందించుకోవాలన్నారు. శిక్షణ శిబిరాల ద్వారా చక్కని జ్ఞానం కలుగుతుందన్నారు. సంస్థ అధ్యక్షుడు చావలి విశ్వేశ్వరరావు మాట్లాడుతూ 50 సంవత్సరాలుగా వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహి స్తున్నామన్నారు. భగవద్గీత విశిష్టతను విద్యార్థులకు తెలిపారు. ప్రధాన కార్యదర్శి ఎం.వనజాదేవి శిబిరానికి నేతృత్వం వహించగా, కార్యక్రమంలో డి.కనకవల్లి, ఎం.వి.రాజశేఖర్, జీవీఆర్ ప్రసాద్ పాల్గొన్నారు.

పదోన్నతులకు డిజిటల్ అసిస్టెంట్లు విముఖం

... 5వ పేజీ తరువాయి

కార్యదర్శి-గ్రేడ్-6 హోదాలో డిజిటల్ అసిస్టెంట్ల నియామకం జరిగింది. అయితే ఉమ్మడి విశాఖ జిల్లాలో గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులుగా ఏర్పడే ఖాళీలను డిజిటల్ అసిస్టెంట్లతో భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 969 గ్రామ పంచాయతీలలో గ్రేడ్-5 కార్యదర్శులుగా పనిచేసిన వారిలో 50 మందికిపైగా గ్రేడ్-4 కార్యదర్శులుగా ఇప్పటికే పదోన్నతులు ఇచ్చారు. గ్రేడ్-4 కార్యదర్శులుగా పనిచేస్తూ ఉన్నత ఉద్యోగాలు సంపాదించుకున్న వారు తమ ఉద్యోగాలకు రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో 100కుపైగా గ్రేడ్5 కార్యదర్శుల ఖాళీలు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ఖాళీ అయిన గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులుగా సమీపంలోని పంచాయతీలల్లో పనిచేస్తున్న కార్యదర్శులకు ఇన్‌చార్జిబాధ్యతలు అప్పగించారు. అర్హుల జాబితా రూపొందించి గ్రేడ్-5 కార్యదర్శుల పోస్టులు భర్తీ చేయాలని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డిజిటల్ అసిస్టెంట్లలో సీనియారిటీ మేరకు జాబితాను విశాఖ జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం రూపొందించింది. అయితే గ్రేడ్-5 కార్యదర్శులుగా పదోన్నతులు తమ వద్దని పలువురు డిజిటల్ అసిస్టెంట్లు జిల్లా పంచాయతీ అధికారులకు నివేదించారు. పదోన్నతులు కోసం ప్రతి ఉద్యోగి ఎదురుచూస్తుంటారని, అటువంటిది పదోన్నతులు వద్దని చెప్పడంపై అధికారులు ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. డిజిటల్ అసిస్టెంట్లుగా సచివాలయంలో డెస్క్ జాబ్ చేయడం తమకు సులువుగా ఉంటుందని, గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతి తీసుకుంటే పాలన మొత్తం పర్యవేక్షించడంతో పాటు రాజకీయ నాయకుల నుంచి ఒత్తిళ్లు వంటివి భరించాల్సి ఉంటుందని అంటున్నారు. పదోన్నతులు వద్దనే వారి వివరాలు సేకరించే పనిలో పంచాయతీ అధికారులు ఉన్నారు. మొత్తం వివరాలు తీసుకుని పంచాయతీరాజ్ కమిషనరేట్‌కు పంపి, తరువాత ప్రక్రియ చేపట్టాలని యోచిస్తున్నారు.

డిగ్రీ ప్రవేశాల్లో మాయ!

... 5వ పేజీ తరువాయి

ఏయూ పరిధిలో ఈక్వెలెన్సీ గుర్తింపు ప్రక్రియ చేపట్టడం లేదు.

భారీగా ప్రవేశాలు..

ఏయూ పరిధిలో 196 డిగ్రీ కాలేజీలు ఉన్నాయి. వీటిలో 38 కాలేజీల్లో డిగ్రీ, పీజీ రెండూ నిర్వహిస్తున్నారు. ఆయా కాలేజీల్లో ఏటా సుమారు 20 వేల మంది విద్యార్థులు డిగ్రీ ప్రవేశాలు పొందుతుంటారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వారు ఉద్యోగాలు, వ్యాపారాల రీత్యా నగరంలో నివసిస్తున్నారు. వారిలో కొందరు గుర్తింపులేని కాలేజీల నుంచి ఇంటర్ సర్టిఫికెట్లను సంపాదించి, డిగ్రీలో చేరుతున్నారు. అంతేకాదు ఇక్కడి వారిలోనూ కాలేజీకి వెళ్లి చదివేందుకు అవకాశం లేని కొందరు ఇలా సర్టిఫికెట్లు కొనుగోలు చేసి డిగ్రీలో చేరుతున్నారని సమాచారం. దీనిపై ఏయూ అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించడంతో పాటు ఆయా కాలేజీలపై నిఘా పెట్టాలని కోరుతున్నారు.

వివాహిత హత్య

... 5వ పేజీ తరువాయి

కాలిపోవడంతో ఆనవాళ్లు లభించలేదని ఏసీపీ అప్పలరాజు తెలిపారు. ఆనందపురం, పోతినమల్లయ్యపాలెం, పద్మనాభం, భీమిలి పోలీస్ సిబ్బందితో ఆరు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటుచేసి, దర్యాప్తు బాధ్యతను అప్పగించినట్లు ఏసీపీ ఎస్.అప్పలరాజు చెప్పారు. పోస్టుమార్టం అనంతరం వివరాలు తెలిసే అవకాశముందని భీమిలి సీఐ బి.తిరుమలరావు తెలిపారు.

హౌసింగ్‌లో రిటైర్డు ఏఈ దందా

... 5వ పేజీ తరువాయి

పి.దుర్గామాధవికి 1,295, గ్రోత్ వెంచర్స్‌కు 1,793, సాయి ఎంటర్‌ప్రైజస్‌కు 2,044, మౌంటెన్ గ్రో కనస్ట్రక్షన్స్‌కు 2,597, శ్రావ్య ఇన్‌ఫ్రాకు 850, ఎస్‌వీ కనస్ట్రక్షన్స్‌కు 1,343, ఆద్య కనస్ట్రక్షన్స్‌కు 2,495 ఇళ్లు అప్పగించారు. వారితో హౌసింగ్ కార్యాలయంలో సమావేశం నిర్వహించి ప్రతి ఇంటికీ రూ.మూడు వేలు నుంచి రూ.నాలుగు వేలు ఇవ్వాలని అడిగినట్టు ప్రచారం జరుగుతోంది. ఇదిలావుండగా రిటైర్డు ఏఈ తమకు తెలియకుండా ఉన్నతాధికారుల ద్వారా 11 వేల ఇళ్లు ఇతర సంస్థలకు అప్పగించడంపై పాత కాంట్రాక్టర్లు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటివరకూ తాము చేసిన పనుల మేరకు బిల్లులు ఇవ్వకుండా మరొకరికి ఎలా ఇస్తారని ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం జిల్లా హౌసింగ్ కార్యాలయంలో రిటైర్డు ఏఈ హవా కొనసాగుతుండంతో అటు కాంట్రాక్టర్లు, ఇటు సిబ్బంది సతమతమవుతున్నారు.

మండలాలకు నోట్ పుస్తకాలు

... 5వ పేజీ తరువాయి

ఆక్స్‌ఫర్డు డిక్షనరీ, ఒకటో తరగతి పిల్లలకు బొమ్మల పుస్తకం ఉంటాయి. గతంలో ఈ కిట్‌ను జగనన్న విద్యా దీవెన పథకంగా ప్రచారం చేసేవారు. గత ఏడాది కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్రగా పేరు మార్చింది. నోట్ పుస్తకాలపై ప్రభుత్వ అధినేతల ఫొటోలు లేకుండా చర్యలు తీసుకున్నారు. ఇప్పటివరకూ జిల్లాకు నోట్ బుక్స్ పూర్తిస్థాయిలో, పాఠ్యపుస్తకాలు 60 శాతం వరకూ రాగా మండలాలకు పంపించారు. మండల పాయింట్లలో నోట్ పుస్తకాలను డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్, సమగ్రశిక్షా అభియాన్ ఏపీసీ చంద్రశేఖరరావు, సీఎంవో దేముడుబాబు పరిశీలించారు.

మెహర్‌నగర్‌లో తీరనున్న నీటి కష్టాలు

» చురుగ్గా సాగుతున్న పైపులైన్ పనులు
» వారం రోజుల్లో పూర్తిస్థాయిలో నీటి సరఫరా ?

గాజువాక, మే 2 (ఆంధ్రజ్యోతి) : తాగునీటి సమస్యతో సతమతమవుతున్న జీవీఎంసీ 72వ వార్డు మెహర్‌నగర్ ప్రాంతవాసులకు కష్టాలు తీరనున్నాయి. ప్రస్తుతం తాగునీరు అంతంతమాత్రంగానే సరఫరా అవుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ క్రమంలో ఆయా కాలనీల ప్రజలు కార్పొరేటర్ ఏజె స్టాలిన్, టీడీపీ నాయకులు అక్కిన లక్ష్మణరావు దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. దీంతో తాగునీటి సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకొంటూ వాటర్ వర్క్స్ ఇంజనీర్లు ఆయా ప్రాంతాలను పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న చిన్న పైప్‌లైన్ తొలగించి వాటి స్థానంలో అధిక సామర్థ్యం కలిగిన పైప్‌లైన్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో గత రెండు రోజులుగా పైప్‌లైన్ ఏర్పాటు పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ క్రమంలో వారం రోజుల లోపే పూర్తిస్థాయిలో మెహర్‌నగర్ ప్రాంత ప్రజలకు తాగునీరు సరఫరా చేయనున్నట్టు సంబంధిత ఇంజనీరింగ్ విభాగం అధికారులు చెబుతున్నారు. దీనిపై మెహర్‌నగర్ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


పైపులైన్ ఏర్పాటు కోసం తవ్వుతున్న గొయ్యి

స్టీల్‌ప్లాంటు ఫైనాన్స్ విభాగాధిపతికి అభినందనలు


ఫైనాన్స్ విభాగాధిపతిని అభినందిస్తున్న సీ ప్రతినిధులు

ఉక్కుటౌన్‌షిప్, మే 2 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంట్ ఫైనాన్స్ విభాగాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన హేమంత్‌కుమార్ ఝాను ఉక్కు అధికారుల సంఘం ప్రతినిధులు (సీ) శుక్రవారం కలిసి అభినందనలు తెలిపారు. స్టీల్ ప్లాంట్‌లో అనుభవజ్ఞులైన అధికారి అయిన హేమంత్‌ను విభాగాధిపతిగా నియమించడం ఆనందకరమని పేర్కొన్నారు. ఉద్యోగులకు సకాలంలో వేతనాలు ఇచ్చే విషయంలో తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ప్లాంటులో పూర్తిస్థాయి ఉత్పత్తి సాధించే విధంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సీ అధ్యక్షుడు చంద్రరావు, ప్రధాన కార్యదర్శి కేవీడీ ప్రసాద్, ఉపాధ్యక్షుడు టి.శ్రీనివాసరావు, కోశాధికారి పి.లోకేష్, సభ్యుడు కెప్రశాంత్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌ను కలిసిన మేయర్ పీలా

వెంకోజీపాలెం,మే 2 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ మేయర్‌గా ఎన్నికైన పీలా శ్రీనివాసరావు, రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో కలిసి రాష్ట్ర చీఫ్ సెక్రటరీ కె. విజయానంద్‌ను అమరావతి సచివాలయంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మహా విశాఖ నగరాభివృద్ధికి నిధులు కేటాయించి సహకరించాలని చీఫ్ సెక్రటరీని మేయర్ కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్.. మేయర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా విశాఖ నగరాన్ని మరింత ప్రగతిపథంలో నడిపించేందుకు జీవీఎంసీలో సుపరిపాలన సాగిస్తూ విశాఖ నగర ప్రజలకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు, అందించాల్సిన సంక్షేమ కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.


చీఫ్ సెక్రటరీ విజయానంద్ మొక్క అందిస్తున్న మేయర్ పీలా శ్రీనివాస్, చిత్రంలో గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్

రైల్వే ప్రయాణికులకు వాటర్ బాటిళ్లు పంపిణీ

కూర్మన్నపాలెం, మే 2 (ఆంధ్రజ్యోతి) : వేసవి రద్దీ నేపథ్యంలో దువ్వాడ రైల్వే స్టేషన్లో శుక్రవారం మధ్యాహ్నం వివిధ రైళ్లల్లో సాధారణ భోగీల ప్రయాణికులకు మినరల్ వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తూర్పు కోస్తా రైల్వే జోనల్ కన్సల్టెన్సీ కమిటీ సభ్యుడు కంచుమూర్తి ఈశ్వర్ మాట్లాడుతూ ప్రయాణికులకు మినరల్ బాటిల్స్‌ను పంపిణీ చేయ డం అభినందనీయమన్నారు. ఈ పంపిణీ జూన్ నెల వరకూ ఉంటుందన్నారు. ప్రతి రోజూ 500 బాటిల్స్‌ను పంపిణీ చేస్తామన్నారు. లయన్స్ క్లబ్, మానవ వికాస వేదిక, స్పందన చేయూత ఫౌండేషన్, సర్వహిత, మానవత, సత్యసాయి ఛారిటబుల్ ట్రస్టులు, దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సహాయ సహకారాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు జామవా, భాస్కరరాజు, రామామణి, రాజేశ్వరరావు, స్ఫూర్తి, ఆదిల్, రహ్మాన్, శ్రీనివాస్, కామేశ్వరరావు, జీవీ రావు , ఆర్పీఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


స్టేషన్ వద్ద అసోసియేషన్ సభ్యులు

మౌనిషాకు డాక్టర్ శారదాబాయి గోల్డ్ మెడల్ ప్రదానం

విశాఖపట్నం, మే 2 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రా మెడికల్ కాలేజీ (ఏఎంసీ)లో గైనిక్ విభాగంలో పీజీలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన డాక్టర్ జేపీ మౌనిషాకు డాక్టర్ కె.శారదాబాయి మెమోరియల్ గోల్డ్ మెడల్‌ను ప్రదానం చేశారు. గైనిక్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభతో రాణించిన విద్యార్థులకు గైనిక్ విభాగ ప్రొఫెసర్‌గా పని చేసిన డాక్టర్ శారదాబాయి పేరుతో గోల్డ్ మెడల్ ప్రదానం చేస్తుంటారు. ఈ ఏడాదికి డాక్టర్ మౌనీషాకు ఏఎంసీ పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద, పూర్వసూపరింటెండెంట్ డాక్టర్ మధుసూదన్‌బాబు గోల్డ్ మెడల్ ప్రదానం చేశారు. తన భార్య పేరుతో గోల్డ్ మెడల్‌ను అందించడం ఆనందంగా ఉందని, విద్యార్థులను ప్రోత్సహించే ఉద్దేశంతో గైనిక్ పీజీ విద్యార్థులకు ఈ మెడల్ అందిస్తున్నట్టు డాక్టర్ మధుసూదన్‌బాబు వెల్లడించారు.


మౌనిషాకు గోల్డ్ మెడల్‌ను బహూకరిస్తున్న డాక్టర్ సంధ్యాదేవి, డాక్టర్ శివానంద, డాక్టర్ మధుసూదనరావు, డాక్టర్ సరోజినీ



సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ షణ్ముఖరావు

ఆటో డ్రైవర్లు తగు జాగ్రత్తలు తీసుకోవాలి

» జిల్లా అదనపు జడ్జి జి. షణ్ముఖరావు

గాజువాక, మే 2 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లు తగు జాగ్రత్తలు తీసుకొని ఆటోలను జాగ్రత్తగా నడపాలని 13వ అదనపు జిల్లా జడ్జి జి.షణ్ముఖరావు సూచించారు. గాజువాక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అసంఘటిత కార్మికులకు శుక్రవారం కోర్టులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జస్టిస్ షణ్ముఖరావు మాట్లాడుతూ చట్ట ప్రకారం వాహనాలకు అన్ని పత్రాలు ఉండాలన్నారు. చట్టంలోని అంశాలను వివరించారు. మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం ఆటోలను నడపాలని పేర్కొంటూ వాహనాలు నడిపే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు యశోదరవ వేదమణి, డి.చిరంజీవి పాల్గొన్నారు.

సంస్థ ప్రగతిలో ప్రతి ఉద్యోగిది కీలకపాత్ర

» ఇంటక్ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్


నగేశ్‌ను సత్కరిస్తున్న అధికారులు, ఉద్యోగులు

ఉక్కుటౌన్‌షిప్, మే 2 (ఆంధ్రజ్యోతి) : సంస్థ ప్రగతిలో ప్రతి ఒక్క ఉద్యోగిది కీలకపాత్ర అని ఇంటక్ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. ప్లాంట్ బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగంలో సుదీర్ఘ కాలం సేవలు అందించిన ఉద్యోగి పీవీ నగేష్‌ను ప్లాంటులో శుక్రవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాంటుకు అత్యంత కీలకమైన బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగంలో సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూనాయకత్వం వహించటం గొప్ప విషయమన్నారు. సంస్థ మరింత ప్రగతి కోసం కార్మికులు ఐక్యంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ, నేతలునీరుకొండ రామచంద్రరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

దుర్గమాంబ ఆలయంలో పూజలు

అగనంపూడి, మే 2 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 85వ వార్డు పరిధి అగనంపూడి ఉక్కు నిర్వాసిత గ్రామాల ఆరాధ్య దేవత దుర్గమాంబ ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అమ్మవారిని నూతన వస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు. పరసర ప్రాంత గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకొని పసుపు, కుంకుమలు, చీరలు సమర్పించి పూజలు చేశారు. స్థానిక బ్రొమాంబ పారాయణ సేవా సమితి మహిళలు ఆలయంలో లలితా పారాయణం, విష్ణుసహస్ర నామా పారాయణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా గణేశ్, పారాయణ సేవా సమితి ఆర్గనైజర్ చిత్తా రామారావు తదితరులు పాల్గొన్నారు.



5 నుంచి ఆధార్ స్పెషల్ క్యాంపు

ఉక్కుటౌన్‌షిప్, మే 2 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటు టౌన్‌షిప్‌లో ఈ నెల 5 నుంచి 15వ తేదీ వరకు ఆధార్ స్పెషల్ క్యాంప్ నిర్వహించనున్నట్టు 78వ వార్డు కార్పొరేటర్ బి. గంగారావు తెలిపారు. సెక్టార్-1 షాపింగ్ కాంప్లెక్స్‌లో క్యాంపు నిర్వహించనున్నట్టు తెలిపారు. కొత్త ఆధార్, బయోమెట్రిక్ అప్‌డేట్, సవరణలు చేయడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని టౌన్‌షిప్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కుల గణన అవసరం

» పీసీసీ అధికార ప్రతినిధి ముత్యాలు


మాట్లాడుతున్న ముత్యాలు

పెదగంట్యాడ, మే 2 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆదేశాలతో తెలంగాణలో కుల గణన చేపట్టడం ద్వారా సీఎం రేవంత్ రెడ్డి ఆదర్శంగా నిలిచారని ఏపీసీసీ అధికార ప్రతినిధి జెర్రిపోతుల ముత్యాలు అన్నారు. గాజువాక కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం పెదగంట్యాడలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం జనగణనతో పాటు కులగణన చేయాలని నిర్ణయించడం అభినందనీయమన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆశయ సాధనకు ప్రతి కార్యకర్త శ్రమించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎంఎస్ వర్మ, యరబాల భూలోక, కోరాడ చిన్నారావు, శనివాడ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

'సుభోజనం'కు రూ.36.50 లక్షల విరాళం


భోజనం వడ్డిస్తున్న అంకినీడు ప్రసాద్

అగనంపూడి, మే 2 (ఆంధ్రజ్యోతి) : అగనంపూడి సమీపంలో గల హోమీ బాబా క్యాన్సర్ ఆస్పత్రి, పరిశోధనా కేంద్రంలో రోగుల, వారి సహాయకులకు హరేకృష్ణ మూవ్‌మెంట్ అందజేస్తున్న సుభోజనం ఏడాది పాటు అందించేందుకు కృష్ణా జిల్లాకు చెందిన కోసూరు దాత అంకినీడు ప్రసాద్ ముందుకొచ్చారు. ఇందేకోసం ఆయన రూ 36.50 లక్షలు అందజేసినట్టు సంస్థ అధ్యక్షుడు నిష్కంచన భక్తదాస తెలిపారు. నిత్యం 450 మందికి ఉచితంగా సుభోజం అందజేస్తున్నామన్నారు. ఏడాది పాటు భోజనం అందించేందుకు అంకినీడు ప్రసాద్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఇదిలావుంటే శుక్రవారం సుభోజనం కార్యక్రమాన్ని ప్రసాద్ రోగులకు వడ్డించి ప్రారంభించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **హిట్** : జగదాంబ, సంగం, శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లలిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
● **రెట్రో** : మెలోడి, శరత్, శ్రీకన్య, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి)
● **అర్జున్ సన్నాఫ్ వైజయంతి** : సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
● **ఓదెల-2** : శ్రీలీలామహల్, సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
● **కోర్ట్** : వెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 19,టమాటా 16, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 28, పచ్చిమిర్చి 24, కాకరకాయలు 34, బీరకాయలు 34, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 28, క్యాబేజి 13, క్యారెట్ 32 దొండకాయలు 26, బంగాళదుంపలు 18, అరటికాయ 8, మునక్కాడలు (కిలో) 38, అల్లం 44, బరబాటి 26, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 125, బద్దచిక్కుడు 48, దోసకాయలు 18, వెల్లుల్లి 100, కొబ్బరికాయ 25, బీన్స్ (పెన్సిల్) 66, కీరదోస 30, కాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 34,కంద 80, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 30, బ్రకోలి 45 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర 3, పాలకూర 3, తోటకూర 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 30, కర్ర పెండలం 18, మామిడి అల్లం 48, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	450
విజయనగరం	454
శ్రీకాకుళం	454

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	120
లైవ్ ధర	140
విత్ స్కిన్	250
స్కిన్‌లెస్	260

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కొమ్మాది, మే 2 (ఆంధ్రజ్యోతి) : బక్కన్నపాలెంలోని ఐటీఐలో ప్రవేశానికి రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ పురుష దివ్యాంగ యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రాజెక్టు ఆఫీసర్ జె. మాధవి తెలిపారు. శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను కార్పెంటర్ (24), షీట్ మెటల్ వర్కర్ (20), వెల్డర్ (20) ట్రేడులలో ప్రవేశాలకు ఈనెల 24వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశం పొందిన వారికి ఉచిత భోజన, వసతి సదుపాయం కల్పిస్తామని, శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తామన్నారు. ఆసక్తి గల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. పూర్తి వివరాలకు 9000013610 నంబర్‌ను సంప్రతించాలని సూచించారు.

వృత్తి విద్యా కోర్సులకు దరఖాస్తుల స్వీకరణ

విశాలాక్షినగర్, మే 2 (ఆంధ్రజ్యోతి) : విశాలాక్షినగర్‌లో ఉన్న దయాల్బాగ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ (డీఈఐ) వృత్తి విద్యా కోర్సు ల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఇనిస్టిట్యూట్ ఇన్‌చార్జి దక్షిణామూర్తి తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడు దల చేశారు. డిప్లొమో ఇంజనీరింగ్ ఎలక్ట్రానిక్స్ మూడేళ్ల కోర్సుతో పాటు బీబీఏ ఆన్‌లైన్ మూడేళ్ల కోర్సు, బ్యాచిలర్ ఆఫ్ ఒకేషనల్ కోర్సు (అగ్రికల్చరల్ టెక్నాలజీ)కు దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఆసక్తి గల వారు ఈనెల 28లోగా దయాల్‌నగర్‌లో ఉన్న ఇనిస్టిట్యూట్‌లో దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9963340611 నెంబర్‌లో సంప్రతించాలని ఆయన సూచించారు.

కనక దుర్గమ్మకు మామిడి పండ్లతో అలంకరణ

పెందుర్తి, మే 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎస్‌ఆర్ పురంలో కొలువైయున్న కనకదుర్గ ఆలయంలో వైశాఖ శుద్ధ పంచమి సందర్భంగా అమ్మవారిని శుక్రవారం మామిడి పండ్లతో అలంకరించారు. మొత్తం 108 పండ్లతో అలంకరించి, పూజలు, అభిషేకాలు జరిపారు. ఆలయ చైర్మన్ కాయితీ ఎర్రిబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



టీడీపీ క్లస్టర్ కన్వీనర్లకు ఐడీ కార్డులు పంపిణీ

పెందుర్తి, మే 2 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 96వ వార్డు పెందుర్తి టీడీపీ క్లస్టర్ పరిధిలో ఉన్న కన్వీనర్లు, బూత్ అధ్యక్షులకు క్లస్టర్ ఇన్‌ఛార్జి పెంటకోట రాజేంద్రప్రసాద్ శుక్రవారం పార్టీ గుర్తింపు కార్డులు అందజేశారు. మేయర్ పీలా శ్రీనివాసరావు సూచన మేరకు ఈ కార్డులు పంపిణీ చేసినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిల్లి రమేశ్, పీలా జితేంద్ర, ఆళ్ల రమేశ్, ఐతంశెట్టి నూకరాజు, బండారు నాగు, తదితరులు పాల్గొన్నారు.

శారదా పీఠంలో శంకరాచార్యుల జయంతి


హారతినిస్తున్న స్వాత్మానందేంద్ర

పెందుర్తి, మే 2 (ఆంధ్రజ్యోతి) : చినముషిడివాడ శారదా పీఠంలో అద్వైత బోధకుడు జగద్గురు ఆది శంకరాచార్యుల జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పీఠం ఆవరణలో ఉన్న శంకరాచార్యులు విగ్రహానికి ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్ర సరస్వతి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు స్వామీజీ అనుగ్రహభాషణ చేశారు. అంతకుముందు వేదాభ్యాసన శిష్యులు స్వామీజీకి గురు వందనం సమర్పించారు.

టెన్త్ విద్యార్థుల ప్రత్యేక తరగతులు పరిశీలన

గోపాలపట్నం, మే 2 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను డీఈవో ప్రేమ్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రతి మండలంలో రెండు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈమేరకు హైస్కూల్‌లో నిర్వహిస్తున్న తరగతులను డీఈవో పరిశీలించి, ఉపాధ్యాయులకు సూచనలిచ్చారు. పరీక్షల్లో విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడానికి అవసరమైన మెలకువల్ని బోధించారు.


విద్యార్థిని శ్రీవేదను అభినందిస్తున్న డీఈఓ ప్రేమ్ కుమార్

శ్రీవేదకు అభినందనలు

వేపగుంట : వేపగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని శ్రీవేద 593 మార్కులు సాధించడంతో డీఈఓ ప్రేమ్‌కుమార్ ఆమెను అభినందించారు. శుక్రవారం ఆయన ఆ పాఠశాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ సోమేశ్వరరావు, ఎంఈఓ మధుమూర్తి,ఇన్‌చార్జి హెచ్‌ఎం మహేశ్, ఉపాధ్యాయులు యామిని, ఎంఎన్ మూర్తి, నాయుడు, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పాఠశాల ప్రహరీ గోడ


పాఠశాల వెనుక భాగంలో గోడ దుస్థితి

గోపాలపట్నం, మే 2 (ఆంధ్రజ్యోతి) : గోపాలపట్నం-1 మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు వెనుకభాగంలో ఉన్న ప్రహరీ శిథిలావస్థకు చేరుకుంది. ఈ ప్రహరీ వెనుక భాగంలో పెద్ద కాలువ ఉండడంతో వర్షం నీరు కాలువల నుంచి ఉధృతంగా ప్రవహించడంతో ప్రహరీ పునాదులు పూర్తిగా బలహీనపడ్డాయి. ప్రహరీకి ఆనుకుని ఒకవైపు మరుగుదొడ్లు, మరోవైపు అంగన్‌వాడీ కేంద్రం ఉంది. ఎటువంటి ప్రమాదం జరగకముందే అధికారులు ప్రహరీకి మరమ్మతులు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

సరిపల్లిలో మహా శివుడుకి అన్నాభిషేకం

పెందుర్తి, మే 2 (ఆంధ్రజ్యోతి) : మండలలోని సరిపల్లిలో వెలసిన స్వయంభూ మల్లికార్జున శివాలయంలో ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకుని శుక్రవారం మహా అన్నాభిషేకం నిర్వహించారు. గర్భాలయంలో ఉన్న శివ లింగానికి అభిషేకం జరిపి అనంతరం మహా అన్నాభిషేకం చేశారు. అలాగే ఆలయ ఆవరణలో ఉన్న నందీశ్వరుడ్ని కూడా అన్నంతో అభిషేకించారు. దీపారాధన, పంచామృతాభిషేకాలు తరువాత భక్తులకు దర్శనాలు కల్పించారు.

యూజీడీ పనులు పరిశీలన

ఎన్ఏడీ జంక్షన్, మే 2 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 52వ వార్డు పరిధిలోని పాత కరాస ప్రాంతంలో జరుగుతున్న యూజీడీ పనులను మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ శుక్రవారం పరిశీలించారు. ఈనెల 5వ తేదీ నుంచి జరిగే దుర్గాలమ్మ పండుగ ఘటాలు వీధుల్లో తిరుగుతాయి. ఈమేరకు వాటికి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయనతో పాటు జీవీఎంసీ తాగునీటి విభాగం ఏఈ సుమన్ ఉన్నారు.

గ్రాడ్యుయేషన్ విద్యార్థులకు ఉపాధి శిక్షణ

అక్కిరెడ్డిపాలెం, మే 2 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్య రంగంలో నైపుణ్యం పెంపొందించేందుకు డిగ్రీ విద్యార్థులకు స్వల్పకాలిక సర్టిఫికెట్ కోర్సు నిర్వహిస్తున్నట్టు బొల్లినేని మెడి స్కిల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆరు నెలల పాటు తమ సంస్థ స్టైపెండ్ అందజేయడంతో పాటు శిక్షణ ఇస్తుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు సెల్ ఫోన్ నంబరు 79950 13421లో సంప్రతించాలని సూచించారు.

అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

శ్రీనగర్,మే 2 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 71 వార్డు శ్రీనగర్ దరి సుందరయ్య కాలనీలో అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. స్వామివారికి భక్తులు అభిషేకాలు, పూజలు జరిపారు. నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నాయకులు కోన తాతారావు, పప్పు రాజారావు, కరణం కనకారావు, తదితరులు పాల్గొన్నారు.





పవన్ స్వాగతం.. లోకేశ్ మోదీ చమత్కారం



కాజ టోల్ గేట్ వద్ద బారులు తీరిన వాహనాలు





సభా ప్రాంగణంలోనే వైద్య సేవలు

అద్భుతంగా అమరావతి

అద్వితీయంగా శంకుస్థాపన వేడుక ● రాజధాని గ్రామాల్లో తిరునాళ్ల సందడి

వినాశనం నుంచి వికాసం దిశగా.. అమరావతి పరుగులు పెట్టేందుకు సిద్ధమైంది. శిథిలం నుంచి ప్రపంచం అచ్చెరువొందేలా ఆంధ్రుల కలల రాజధాని పునర్నిర్మాణం దిశగా పయనించనున్నది. ఈ అపురూప కార్యక్రమానికి శుక్రవారం రాజధాని పరిధిలోని వెలగపూడి వేదికగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ శ్రీకారం చుట్టారు. అమరావతి అభివృద్ధి మనమే చేయాలి.. మనమే చేస్తాం.. అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సాక్షిగా పిలుపిచ్చారు. దేవతల రాజధాని అమరావతి దేశాభివృద్ధికి కేంద్రంగా మారుతోం దని.. ఆ స్థాయిలో అభివృద్ధి చేస్తామని మోదీ ప్రజల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. ఇక అమరావతి కేంద్రంగా వివిధ ప్రాజెక్టులతో పాటు రాష్ట్రంలోని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ వివిధ ప్రాజెక్టులను ప్రారంభించి జాతికి అంకితం చేశారు. పునర్నిర్మాణ శంకుస్థాపన మహోత్సవానికి అతిరథ మహారథులతో పాటు ప్రధానమంత్రి మోదీ రాకతో రాజధాని గ్రామాల్లో తిరునాళ్ల వాతావరణం సంతరించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చిన జనాలతో రాజధానిలో పండుగ వాతావరణం కనిపించింది. - తుళ్లూరు, ఆంధ్రజ్యోతి



మహిళల విజయ దరహాసం



దుర్గ గుడి నుంచి సభా వేదిక వద్దకు సైకిల్‌పై వస్తున్న విజయనగరం ఎంపీ అప్పల నాయుడు



సభా వేదిక వద్దకు తరలివస్తున్న విద్యార్థినులు



సభా వేదిక వద్ద ఏర్పాటు చేసిన భోజనాలు



గ్యాలరీల బయట జనం

వైద్య ఆరోగ్య శాఖ డీడీగా నల్లమిల్లి



నల్లమిల్లి వెంకటరమణమూర్తి

విశాఖపట్నం, మే 2 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం డిప్యూటీ డైరెక్టర్ (విటల్ స్టాటిస్టిక్స్)గా నల్లమిల్లి వెంకటరమణమూర్తి నియమితులయ్యారు. కర్నూలు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం లో గణాంక అధికారిగా పనిచేసిన ఆయన పదోన్నతిపై వచ్చారు. శుక్రవారం బాధ్యతలు చేపట్టిన తరువాత కార్యా లయ సిబ్బంది, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. వెంకటరమణమూర్తి 2014 నుంచి 2022 వరకు జీవీఎంసీలో పని చేశారు. కొవిడ్ సమయంలో ప్రత్యేక అధికారిగా కీలక భూమిక పోషించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



శంకరమఠం రోడ్డులో నిలిచిన లారీ

సీతంపేట, మే 2 (ఆంధ్రజ్యోతి): ద్వారకా పట్టణ పోలీసు స్టేషన్ పరిధి శంకరమఠం రోడ్డులో వెళ్తున్న ఒక లారీ సడన్‌గా మరమ్మతులకు గురై డ్రైవర్ ఉన్న లారీ క్యాబిన్ తెరుచుకుంది. లారీ ఇంజన్ బెల్టు ఫెయిల్ కావడంతో ఇలా జరిగిందని డ్రైవర్ పేర్కొన్నాడు. అయితే క్యాబిన్ పైకి లేవడంతో పాటు అక్కడికక్కడే లారీ ఆగిపోయింది. దీంతో కొద్దిసేపు రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ద్వారకా పోలీసులు అక్కడికి చేరుకొని ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పరిస్థితిని చక్కదిద్దారు. నిషేధ సమయంలో లారీ అటు వైపు రావడం, దారిలో నిలిచిపోయి రాకపోకలకు ఆటంకం కలగడంతో ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు.



ప్రధాని మోదీకి స్వాగతం పలుకుతున్న ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, సమావేశానికి హాజరైన ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, పంచకర్ల రమేశ్‌బాబు, ఎమ్మెల్సీలు చిరంజీవిరావు, రామారావు, మేయర్ పీలా శ్రీనివాసరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

అమరావతిలో మన నేతలు

రాష్ట్ర రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనులను శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నుంచి అధిక సంఖ్యలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఇందుకోసం ప్రతి నియోజకవర్గం నుంచి ప్రత్యేక బస్సులు బయలుదేరాయి. రాజధాని నిర్మాణం తిరిగి గాడిన పడడంతో రాష్ట్రానికి మంచిరోజులు వస్తాయని వారంతా అభిప్రాయపడ్డారు. పనులు శరవేగంగా పూర్తై పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తాయన్నారు.

గెయిల్ పైపులైన్ల పనులతో ట్రాఫిక్ మళ్లింపు



గెయిల్ పైపులైన్ పనులు జరిగే ప్రాంతం

విశాఖపట్నం, మే 2 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా (గెయిల్) లిక్విడ్ గ్యాస్ పెట్రోలియం (ఎల్‌పీజీ) పైపలైన్ పనులు చేపడుతోంది. ఈ నేపథ్యంలో ములగాడ-గాజువాక డిపో మార్గంలో శనివారం నుంచి సోమవారం వరకు ట్రాఫిక్ మళ్లిస్తున్నారని గెయిల్ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. విశాఖపట్నం పోర్టు నుంచి జాతీయ రహదారి వరకు పీసీఆర్ సర్కిల్ మీదుగా ఈ పనులు జరుగుతాయని పేర్కొంది. దీంతో రైల్వే సైడింగ్ మార్గం గుండా ట్రాఫిక్‌ను మళ్లిస్తారని, ములగాడ ప్రాంత ప్రజలు సహకరించాలని కోరింది.ఈ పనులు సోమవారం ఉదయం నాలుగు గంటలకే ముగుస్తాయని తెలిపింది.

ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బోల్తా

- తిరుమల నుంచి విశాఖ వస్తుండగా ప్రకాశం జిల్లాలో ప్రమాదం
- స్వల్ప గాయాలతో బయటపడిన ప్రయాణికులు



రాజుపాలెం వద్ద బోల్తా పడిన ట్రావెల్స్ బస్సు

మార్టూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): తిరుమల నుంచి విశాఖ వస్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ప్రకాశం జిల్లా మార్టూరు మండలం రాజుపాలెం రెస్ట్ ఏరియా సమీపంలో శుక్రవారం వేకువజామున బోల్తాపడింది. ముందు వెళుతున్న లారీ అకస్మాత్తుగా కుడివైపునకు తిరగడంతో, బస్సు డ్రైవరు షడన్ బ్రేక్ వేశారు. దీంతో అదుపుతప్పి రోడ్డు పక్క గోతిలో పడింది. ఆ సమయంలో బస్సులో 38 మంది ప్రయాణికులున్నారు. వారంతా విశాఖ, తూర్పుగోదావరి జిల్లాల వారు. సంఘటనా స్థలానికి సీఐ శేషగిరిరావు వెళ్లారు. హైవే అంబులెన్స్, మొబైల్ పోలీసులు, 108 వాహన సిబ్బంది ప్రయాణికులను బయటకు తీశారు. స్వల్పం గా గాయపడిన 13 మంది మహిళలను, ఇద్దరు పురుషులను ప్రభుత్వ ఆస్పత్రికి, మిగిలిన వారిని రెస్ట్ ఏరియాకు తరలించారు. భీమిలి మండలం ఉప్పాడ, చిట్టివలస, భోగాపురం మండలం గుడివాడ, తూర్పుగోదావరి జిల్లాల వారు విశాఖ నుంచి గత నెల 9న పుణ్యక్షేత్ర సందర్శనకు ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో బయలుదేరారు. గురువారం తిరుమల నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. తెల్లవారుజామున సంఘటన జరిగింది. డ్రైవర్ ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ శేషగిరిరావు తెలిపారు.



పట్టు తప్పిందో... ప్రమాదమే!

తీరంలో ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో సందర్శకులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. నగరంలోని పలు మురుగునీటి కాలువలు నేరుగా సముద్రంలోకి వదిలేస్తుండడంతో వాటిని దాటేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. ఆర్కేబీచ్‌లో మురుగు నీటి కాలువను దాటడానికి సందర్శకులు ఫీట్లు చేయాల్సి వచ్చింది. మహారాణిపేట, దసపల్లాహిల్స్ తదితర ప్రాంతాల నుంచి మురుగునీటి కాలువ ఇక్కడ సముద్రంలో కలుస్తోంది. సందర్శకులు దీనిని దాటేందుకు అక్కడి పైపు మాత్రమే ఆధారం. దీంతో ఏమాత్రం పట్టుతప్పినా ప్రమాదమే.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

క్రైం... crime news

విద్యుదాఘాతానికి ఇద్దరు బలి

మురళీనగర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని...



జీవీ పద్మావతి (ఫైల్)

కంచరపాలెం, మే 2 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. వేర్వేరు చోట్ల ఈ ఘటనలు జరిగాయి. మురళీనగర్ అయ్యప్పనగర్ వర్మ కాంప్లెక్స్ వద్ద గల ఓ అపార్టుమెంట్ రెండో ఫ్లోర్‌లో జీవీ పద్మావతి(29) నివసిస్తున్నారు. ఆమె సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని. భర్త ఎంఈఎస్‌లో కాంట్రాక్టు చేస్తుంటారు. ఎప్పటిలాగే రెండో ఫ్లోర్ నుంచి పద్మావతి నిత్యావసర వస్తువులు, పాల ప్యాకెట్లను కింద నుంచి తాడు సహాయంతో పైకి తీస్తుండగా, సమీపంలోని హెచ్‌టీ విద్యుత్ తీగకు తాడు తగిలింది. అది టెలిఫోన్ వైరు కావడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందింది. ఎస్ఐ సమీర్ ఘటనా స్థలానికి చేరుకుని సీసీ టీవీ ఫుటేజీ పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. భర్త అజయ్ ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మారికవలసలో పెయింటర్...



కృష్ణకుమార్ (ఫైల్)

కొమ్మాది, మే 1 (ఆంధ్రజ్యోతి): రహదారి డివైడర్ మధ్యలో విద్యుత్ స్తంభానికి ఉన్న తీగలు తగలడంతో విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన మారికవలస వద్ద గురువారం రాత్రి జరిగింది. పీఎం పాలెం సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాల మేరకు... వైఎస్ఆర్ కాలనీ బ్లాక్ నంబరు 31లో నివసిస్తున్న దుద్ది కృష్ణకుమార్ (38) పెయింటింగ్ పనులు చేస్తుంటాడు. గురువారం రాత్రి పదిగంటల సమయంలో కొమ్మాది నుంచి మారికవలస వెళ్లే రోడ్డు వద్ద ఆటో దిగి జాతీయరహదారి మధ్యలో ఉన్న గ్రిల్స్ దాటుతుండగా అక్కడి స్తంభానికి ఉన్న తీగలు తగలడంతో తీవ్ర విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ఆరిలోవ ఏఎస్ఐ మృతి



ఏఎస్ఐ రమణ (ఫైల్)

ఆరిలోవ, మే 2 (ఆంధ్రజ్యోతి): ఆరిలోవ స్టేషన్ లా అండ్ ఆర్డర్ ఏఎస్ఐ రమణ (60) శుక్రవారం మృతిచెందారు. తన ఇంటి వద్ద ద్విచక్ర వాహనం స్టాండ్ వేస్తుండగా కిందపడిపోవడంతో తలకు తీవ్ర గాయమయింది. కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందారు. కాగా రమణ అనారోగ్యంతో బాధపడుతున్నారని, గురువారం నుంచి సెలవు పెట్టారని సీఐ మల్లేశ్వరరావు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

కార్డన్ సెర్చ్‌లో ముగ్గురు అనుమానితుల గుర్తింపు

- 11 ద్విచక్ర వాహనాలు స్వాధీనం



అనుమానితులను ప్రశ్నిస్తున్న సీఐ

మహారాణిపేట, మే 2 (ఆంధ్ర జ్యోతి): వన్ టౌన్ పరిధిలో పోలీసులు శుక్రవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సీఐ జి.దేముడుబాబు ఆధ్వర్యంలో ఇంటింటా తనిఖీలు చేశారు. అనుమానితుల సమాచారం సేకరించి, వాహనాల డాక్యుమెంట్లు పరిశీలించి, అసాంఘిక కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం ఉన్నవారిని గుర్తించారు. ఈ సందర్భంగా ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారణ నిమిత్తం స్టేషన్‌కు తరలించారు. 11 ద్విచక్ర వాహనాలను సైతం స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ లక్ష్మణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.